
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

శనివారం 1 మార్చి 2025



మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రిలో శుక్రవారం కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తనిఖీలు చేశారు. ఇన్‌పేషెంట్, అవుట్ పేషెంట్, ఎమర్జెన్సీ, ఆపరేషన్ థియేటర్లను ఆయన పరిశీలించారు. రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. - మంగళగిరి సిటీ

8

అమరావతికి అగ్రతాంబూలం



















రూ.కోట్లలో కేటాయింపులు.. గతంలో నిలిచిపోయిన ప్రాజెక్టులతో పాటు కొత్త ప్రాజెక్టులకు నిధుల వరద. శుక్రవారం కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అమరావతికి అగ్రతాంబూలం దక్కింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి అన్న పేరుకు.. రాజధాని పనుల అంశాలకే చోటు ఇవ్వకుండా సరిపెట్టారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమరావతిపై దృష్టి పెట్టడంతో పాటు నిధులు కేటాయించింది. తొలిబడ్జెట్‌లో రూ.3 వేల కోట్లు కేటాయించగా తాజా బడ్జెట్‌లో రాజధాని పనులకు రూ.6 వేల కోట్లను ప్రత్యేకంగా కేటాయించింది. అంతేగాకుండా రాజధానిలోని వివిధ ప్రాజెక్టులకు నిధులు.. గతంలో నిలిచిపోయిన భూసేకరణకు కూడా ప్రత్యేకంగా నిధులు కేటాయింపులు జరగడంతో ఉమ్మడి గుంటూరు జిల్లావాసులతో పాటు రాజధాని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- గతంలో కంటే రాజధానికి రెట్టింపు నిధులు
- మార్చి 15 నుంచి జోరందుకోనున్న నిర్మాణ పనులు
- గుంటూరు ఛానల్ భూసేకరణకు రూ.100 కోట్లు
- ఆచార్య ఎన్జీ రంగా అగ్రి వర్సిటీకి రూ.507 కోట్లు
- గోదావరి - పెన్నా నదుల అనుసంధానానికి రూ.200 కోట్లు
- కూటమి ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులపై హర్షం

నదుల అనుసంధానికి ఊతం

గోదావరి - పెన్నా నదుల అనుసంధానం ప్రాజెక్టుని ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు జరిపింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఏకంగా రూ.200 కోట్ల మూలధనాన్ని కేటాయించి సాగునీటి రంగంపై తన చిత్తశుద్ధిని చాటుకున్నది. దీంతో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎక్కడికక్కడ నిలిచిపోయిన ఈ ప్రాజెక్టు పనులు మరికొద్ది రోజుల్లో పట్టాలెక్కి పరుగులు పెట్టనున్నాయి. ప్రాజెక్టు తొలిదశలో భాగంగా కృష్ణానది నుంచి నకరికల్లు వరకు గోదావరి వరద జలాలను ఎత్తిపోసి నాగార్జునసాగర్ కుడి కాల్వలో కలుపుతారు. పోలవరం ప్రాజెక్టుని 2027కి పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నది. ఈ క్రమంలో పట్టిసీమ ఎత్తిపోతల పథకంతో సంబంధం లేకుండా గ్రావిటీ ద్వారా గోదావరి వరద నీటిని ప్రకాశం బ్యారేజ్‌కు తరలించనున్నారు. అక్కడి నుంచి ఐదు దశల్లో ఎత్తిపోతల పథకాలు, గ్రావిటీ ద్వారా ఏడు వేల క్యూసెక్కుల నీటిని నకరికల్లుకు తరలించి సాగర్ కాల్వలో కలిపేలా ప్రణాళిక రూపొందించారు. 2018లో సీఎంగా చంద్రబాబు ఉన్న సమయంలో రూ.6020.15 కోట్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. తొలిదశ పనులకు సంబంధించి టీడీపీ హయాంలోనే భూసేకరణ పూర్తి చేసి, పనులు ప్రారంభించింది. అయితే వైసీపీ 2019లో అధికారంలోకి వస్తూనే వాటిని నిలిపేసి పల్నాడు కరువు దుర్భిక్ష పథకం అంటూ పేరు మార్చి మూలన పడేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ పనులు ప్రారంభమయ్యాయి. వాటిని ముందుకు తీసుకెళ్లేందుకు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గుంటూరు, సిటీ, విద్య, బాపట్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ప్రకటించిన పూర్తి స్థాయి బడ్జెట్ ఇదే కావడంతో అన్ని వర్గాల ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే వారి ఆశలు, ఆకాంక్షలకు అద్దం పట్టేలా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడుగుల సంక్షేమానికి పెద్దపీట వేశారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు సంబంధించి పలు ప్రాజెక్టులకు పెద్దపీట వేస్తూ మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బడుగులపై బడ్జెట్లో ప్రభుత్వం వరాల వర్షం కురిపించడంపై కూడా ఆయా వర్గాల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. పాఠశాలల్లో మౌలిక వసతులు, తల్లికి వందనం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, విద్యాకిట్లు తదితర పథకాల కోసం పెద్దఎత్తున కేటాయింపులపై విద్యావేత్తలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వందల సంఖ్యలో తరగతి గదుల నిర్మాణం నిలిచిపోగా, వాటి పునః ప్రారంభించడానికి బడ్జెట్ కేటాయింపులు చేయనున్నారు. ప్రధానంగా నాడు నేడు పేరుతో అసంపూర్తిగా ఉన్న భవనాల నిర్మాణం, తాగునీటి కోసం కొనుగోలు చేసిన ప్లాంట్స్ ఇన్‌స్టలేషన్, నూతన భవనాల నిర్మాణం తదితరాలకు నిధులు ఉపయోగించనున్నారు. ఇప్పటికే ఏర్పాటైన డిజిటల్ తరగతుల్ని మరింత ఆధునికంగా తీర్చిదిద్దడానికి ఏర్పాట్లు చేయనున్నారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు నిర్వీర్యమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సంక్షేమానికి పెద్దఎత్తున బడ్జెట్‌లో నిధులు కేటాయించింది.

అమరావతికి.. రూ.6 వేల కోట్లు

నవ్యాంధ్ర కలల రాజధాని అమరావతికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. రాజధాని అభివృద్ధి కోసం కిందటి బడ్జెట్లో కేటాయించిన నిధుల కంటే ఈ బడ్జెట్లో రెట్టింపు కేటాయించింది. రాజధానిపై కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధిని మరోమారు ప్రకటించింది. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురై బడ్జెట్లో ప్రస్తావనకు కూడా నోచుకోని రాజధాని అమరావతి, కూటమి ప్రభుత్వ బడ్జెట్లలో అగ్రతాంబూలం అందుకుంది. కిందటి బడ్జెట్లో రూ.3వేల కోట్లు కేటాయించగా ఈసారి అమరావతి కేపిటల్ సిటీ డెవలప్మెంట్ ప్రాజెక్టుల కింద ఆ మొత్తాన్ని రూ.6 వేల కోట్లకు పెంచింది. ఇప్పటికే ఐకానిక్ టవర్స్‌గా ఉన్న సచివాలయ భవన సముదాయం, అసెంబ్లీ, హైకోర్టు భవనాల నిర్మాణ పనులు జోరందుకోనున్నాయి.

ఇప్పటికే ఆ పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ తుది దశకు చేరింది. అన్నీ సకాలంలో జరిగితే మార్చి 15 నుంచి రాజధాని నిర్మాణ పనులు మరింత జోరందుకోనున్నాయి. 2014- 19ల మధ్య ప్రాధాన్యతను సంతరించుకున్న మెట్రో రైలు ప్రాజెక్టు వైసీపీ హయాంలో ప్రస్తావనకు కూడా నోచుకోలేదు. తాజా బడ్జెట్లో భారీ కేటాయింపుల నేపథ్యంలో మెట్రో ఆశలకు రెక్కలు వచ్చాయి. అమరావతి నిర్మాణంలో కీలకమైన భూ సమీకరణకు బడ్జెట్లో నిధులు కేటాయించారు. తాజాగా రాజధాని పరిధిలోని కీలక రహదారులను జాతీయ రహదారి ఎన్‌హెచ్- 16కు అనుసంధానించే ప్రక్రియ తెరమీదకి వచ్చింది. కరకట్ట రహదారి విస్తరణ ప్రక్రియ కూడా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో భూసమీకరణ జరగాల్సి ఉంది. అలాగే గతంలో కొన్ని గ్రామాల్లో రైతులు రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చేందుకు నిరాకరించారు. ఇప్పుడు వారంతా భూములు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారు. ఇలా భూసమీకరణ (మిగతా 6వ పేజీలో)

రంగా వర్సిటీకి పూర్వ వైభవం

గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం చేయబడిన ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పూర్వ వైభవం దిశగా అడుగులు వేసేందుకు కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయింపు జరిపారు. రాష్ట్ర ఆహార భద్రతకు భరోసా ఇస్తున్న ఆచార్య ఎన్జీ రంగా యూనివర్సిటీకి ప్రభుత్వం బడ్జెట్‌లో పెద్దపీట వేసింది. యూనివర్సిటీ ఆధ్వర్యంలో కుప్పం, బాపట్ల, పల్నాడు, విజయనగరం లలో 4 కొత్త కృషి విజ్ఞాన కేంద్రాల ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కొత్త పరిశోధనలు, నూతన వంగడాల సృష్టించేందుకు భారీగా కేటాయింపు లు జరిపారు. వర్సిటీకి రూ.507.01 కోట్లు నిధులు కేటాయించారు. వర్సిటీలోని డ్రోన్ శిక్షణా సంస్థకు డీజీసీఏ గుర్తింపు ఉన్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.



బాపట్లలో కృషి విజ్ఞానకేంద్రం

కృషి విజ్ఞాన కేంద్రాన్ని బాపట్లలో ఏర్పాటు చేయడానికి శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. 13 మంది సిబ్బందితో ఇది ఏర్పాటు కావడంతో పాటు శాస్త్రవేత్తలు కూడా రైతులకు జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉండనున్నారు. తద్వారా రైతులు సాగులో సమస్యలతో పాటు మట్టి సారం, వాతావరణ అంచనాలు ఇవన్నీ కూడా సకాలంలో రైతులకు చేరే అవకాశాలు ఉంటాయి.

కృష్ణా డెల్టాలో సాగునీటి ప్రాజెక్టులను పురోగతిలోకి తీసుకొచ్చేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు

కృష్ణా డెల్టాకు రూ.400 కోట్లు

జరిపింది. గుంటూరు ఛానల్ విస్తరణ, పొడిగింపునకు రూ.100 కోట్లు కేటాయించే అవకాశం ఉంది. దీంతో కొన్నేళ్లుగా కాగితాల్లోనే ఉన్న గుంటూరు ఛానల్ పనులు పట్టాలెక్కుతాయి. ఈ ప్రాజెక్టు కూడా గత టీడీపీ హయాంలోనే రూపుదిద్దుకొన్నది. ఛానల్ పొడిగింపు కోసం కొన్ని దశాబ్దాలుగా పెదనందిపాడు ప్రాంత రైతులు పోరాటాలు జరుపుతున్నారు. దాంతో అప్పటి ఇరిగేషన్ శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఈ ప్రాజెక్టుని మంజూరు చేశారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి టెండర్లను రద్దు చేసింది. సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటామంటూ వైసీపీ ఐదేళ్ల కాలయాపన చేసింది. గత ఏడాది వరదల సమయంలో గుంటూరు ఛానల్‌కి గండ్లు పడటం వల్ల చాలారోజుల పాటు పొలాలు నీట మునిగాయి. దాంతో కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఢిల్లీ నుంచి ఒక బృందాన్ని రప్పించి ఇక్కడ అధ్యయనం చేయించారు. నిధుల కోసం ప్రతిపాదనలు కూడా పంపించారు. ఇప్పుడు బడ్జెట్‌లో నిధులు కేటాయించడంపై ఆయన, ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్రకుమార్, బూర్ల రామాంజనేయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గుంటూరు ఛానల్

తుది దశకు డొంకరోడ్డు పనులు

త్వరలో అందుబాటులోకి ఆర్‌యూబీ

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని డొంకరోడ్డు రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఆర్‌సీసీ బ్లాకుల అమరిక పూర్తి అయి ఆర్‌యూబీ అందుబాటు లోకి వచ్చింది. అయితే అప్రోచ్ రోడ్డు, సెంట్రల్ డివైడర్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిల్లో అప్రోచ్ రోడ్డు సీసీ పేవ్‌మెంట్‌తో తాజాగా నిర్మించారు. వారం పాటు క్యూరింగ్ పూర్తి కాగానే వాహ నాల రాకపోకలకు అనుమతించొచ్చు. ఇక్కడ అడ్డుగా ఉన్న భవనాలను తొలగించకపోవడం వల్ల సెంట్రల్ డివైడర్‌ని డొంకరోడ్డు వైపున కుడివైపునకు జరపాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. ఏదిఏమైనా ఆర్‌యూబీలోకి ప్రవేశించడానికి మలుపు వద్ద వాహనదారులకు కాస్త ఇబ్బందే. ముఖ్యంగా కార్లు, ఆటోలు వంటివి ప్రవేశించే సమయంలో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం కనిపిస్తున్నది. కాగా ఆర్‌యూబీ లోపలి భాగంలో ఇరువైపులా గోడలకు అందమైన పెయింటింగ్ పనులు జరుగుతున్నాయి.



డొంక రోడ్డు ఆర్‌యూబీకి నిర్మాణం చేసిన అప్రోచ్ రోడ్డు




ఆర్‌యూబీ లోపలి భాగంలో అందమైన పెయింటింగ్స్

రెవెన్యూ సవరణలు

భూ సమస్యల దిద్దుబాటుపై దృష్టి

- వైసీపీ హయాంలో భూ రికార్డులు తారుమారు
- మూడేళ్లుగా కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- ఒక్కో గ్రామం ప్రాతిపదికగా సమస్యలకు వినూత్నంగా పరిష్కారం
- ఇప్పటి వరకు వేల ఎకరాలకు చెందిన 5800 మంది రైతులకు ఊరట
- రీ సర్వే కంటే ముందే సమస్యలు గాడిన పెట్టే ప్రయత్నంలో అధికారులు
- తెనాలి తరహాలో మిగిలిన మండలాల్లో ప్రయత్నిస్తే చిక్కులు వీడినట్టే



బుర్రిపాలెం గ్రామం ఏరియల్ వ్యూ

తెనాలి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఒకరి భూమి మరొకరి ఖాతాలోకి మారిపోతే.. దశాబ్దాలుగా హక్కు కల్గిన భూమి నిషేధిత జాబితాలోకి వెళ్లిపోతే.. భూమి, పత్రాలు సక్రమంగానే ఉన్నా రికార్డులు మార్చేస్తే.. ఇలా ఒకటి.. రెండు కాదు. వందల్లో సమస్యలతో వేలల్లో రైతులు ప్రతీ గ్రామంలోనూ అల్లాడిపోతున్నారు. ప్రతి గ్రామంలోనూ 90 శాతానికిపైగా రైతుల భూముల చరిత్రే మారిపోయి ఎటూపాలుపోని పరిస్థితుల్లో ఉన్నారు. చేసిన తప్పును చక్కదిద్దే చర్యలే లేకపోగా, రైతులను నానా అవస్థలకు గురిచేస్తున్నారు. పైగా వారు చేసిన తప్పు సరిచేయడానికి రైతుల నుంచే రూ.లక్షల్లో లంచాలు దండుకుంటున్న దారుణాలున్నాయి. అయితే తెనాలిలో దీనికి పూర్తిభిన్నంగా ఓ అధికారి విధులు సక్రమంగా నిర్వహిస్తే ఎలా ఉంటుందనేందుకు ఉదాహరణగా నిలిచారు. సంవత్సరాల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులకు ఊహించని పెద్ద ఊరటే ఇస్తున్నారు. మా వల్ల జరిగిన పొరపాటును మేమే సరిచేస్తామని, అర్జీ కూడా అవసరం లేకుండా, కార్యాలయానికి రానవసరం లేకుండా భూమికి సంబంధించిన ప్రతి పొరపాటును చక్కదిద్దే కార్యక్రమం చేపట్టారు. మిగిలిన అధికారులకు ఆదర్శంగా నిలిచారు.

రీ సర్వే లోపే చక్కదిద్దేలా..

వైసీపీ హయాంలో జరిగిన రీ సర్వేలో జరిగిన పొరపాట్లు, తాజాగా జరుగుతున్న రీ సర్వేకు ముందే సరిచెయ్యాలనే లక్ష్యాన్ని తెనాలి అధికారులు పెట్టుకున్నారు. దీనికోసం ఒక్కో గ్రామాన్ని ప్రాతిపదికగా తీసుకుని సవరణలకు శ్రీకారం చుట్టారు. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో కొందరు నేతలు రైతుల భూములను కొట్టేసేందుకు రీ సర్వేను అవకాశంగా చేసుకున్నారు. నేరుగా పొలాలకు వెళ్లి పరిశీలించాల్సిన సిబ్బంది ఎక్కడో ఉండి ఆ భూముల యాజమాన్య హక్కులను తిరగరాశారు. దీంతో తమ భూమిని అమ్ముకునేందుకు సిద్ధపడిన రైతులకు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కొర్రీలు చూపడంతో అడ్డుకట్ట పడుతూ వచ్చింది. అసలు పొరపాటు ఎక్కడ జరిగిందనే విషయాన్ని తెలుసుకునేందుకు కూడా ఒక్క అధికారి శ్రద్ధ చూపలేదు. తమ భూముల పరిస్థితి పరిశీలించి అన్ని పత్రాలను చూపించినా అధికారుల్లో గత ప్రభుత్వ కాలంలో చలనమే లేకుండాపోయింది.

తెనాలి తహసీల్దారు దృష్టి

కూటమి ప్రభుత్వం వచ్చాక తెనాలి తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన గోపాలకృష్ణ గత రీసర్వేలో జరిగిన తప్పులపై దృష్టిపెట్టారు. భూ స్వభావం, పేరు వంటి వివరాలు నమోదు కావాల్సిన కాలం 6లో జరిగిన లోపాలతో భూముల అమ్మకాలు జరగక అవస్థలు పడుతున్న రైతులు నేరుగా సీఎం చంద్రబాబు దగ్గరకే వెళ్లి మొరపెట్టుకున్నారు. ఈ క్రమంలో వీటిని వెంటనే సరిచెయ్యాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్న రెవెన్యూ సిబ్బంది దీనిపై కసరత్తు చేసి, 5800 మంది రైతులకు సంబంధించి వేల ఎకరాల సమస్యకు పరిష్కారం చూపారు. అయితే ఇదొక్కటే కాకుండా, భూములకు సంబంధించి అనేక లోపాలు (మిగతా 6వ పేజీలో)

జన్యుమార్పిడి ద్వారా పంటల అభివృద్ధి



సమావేశంలో ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం అధికారులు, పరిశోధనా సంచాలకులు

లాంఫాం(తాడికొండ), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా పెరుగుతున్న జనాభాకు ఆహారాన్ని సమపాళ్లలో అందించాలంటే జన్యుమార్పిడి ద్వారా పంటలను అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఉందని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ శారదా జయలక్ష్మీదేవి అన్నారు. శుక్రవారం లాంఫాంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బయోటెక్నాలజీ కన్సార్టియం ఇండియా, ఫెడరేషన్ ఆఫ్ సీడ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా వారు సంయుక్తంగా జన్యుమార్పిడి ద్వారా పంటల అభివృద్ధి అనే అంశంపై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ బయోటెక్నాలజీ ద్వారా తెగుళ్లను తట్టుకునే వంగడాలను ఆవిష్కరించాలని సూచించారు. బయోటెక్నాలజీ రంగంలో ప్రగతిని సాధించాలంటే పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం, నాలెడ్జ్ షేరింగ్ వర్క్‌షాపులు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. బయోసీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ పరేష్ వర్మ మాట్లాడుతూ పంటల ఉత్పాదకతను జన్యుమార్పిడి రకాలు ఏవిధంగా సుస్థిరంగా ఉంచుతాయని అన్నారు. ఫెడరేషన్ ఆఫ్ సీడ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా సలహాదారులు, ఏజీవీఏవైపై సహ వ్యవస్థాపకుడు రామ్ కౌండిన్య మాట్లాడుతూ వ్యవసాయ సమస్యలను పరిష్కరించేందుకు బయోటెక్నాలజీ కీలకమన్నారు. వర్క్‌షాపులో జీనోమ్ ఎడిటింగ్, పురుగు, వ్యాధి నిరోధకత, నేలసారం, చిన్న రైతులకు బయోటెక్నాలజీ వల్ల కలిగే ఆర్థిక ప్రయోజనాలను చర్చించారు. కార్యక్రమంలో బయోటెక్ కన్సార్టియం ఇండియా లిమిటెడ్ చీఫ్ జనరల్ మేనేజర్ డాక్టర్ విభా ఆహుజా, విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకులు డాక్టర్ పీవీ సత్యన్నారాయణ, అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎన్.వీ.వీ.ఎస్ దుర్గాప్రసాద్, సీఐసీఆర్ డైరెక్టర్ డాక్టర్ వైజీ ప్రసాద్, డాక్టర్ రాణిచాప్రా, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

విజ్ఞాన శాస్త్రం నూతన మార్గాలను సృష్టిస్తోంది



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న సోమశేఖరరెడ్డి

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన శాస్త్రం మనిషి జీవితాన్ని ప్రతి మూలలో ప్రభావితం చేస్తోందనీ, వైద్యం నుంచి సమాచార సాంకేతికత వరకు, జీవన శైలిలో నుంచి అంతరిక్ష పరిశోధనల వరకు శాస్త్రం నూతన మార్గాలను సృష్టిస్తోందని హైదరాబాద్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీలోని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ మెటీరియల్స్ టెస్టింగ్ గ్రూప్ హెడ్, సైంటిస్ట్ కె.సోమశేఖర్ రెడ్డి అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్స్ అండ్ హ్యుమానిటీస్ విభాగంలోని ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నేషనల్ సైన్స్ డే సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చంద్రయాన్, మార్స్ మిషన్, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం వంటి ప్రయోగాలతో మానవ జాతి కొత్త ప్రపంచాలను అన్వేషిస్తోందన్నారు. జెనోమిక్స్, రోబోటిక్ సర్జరీ, కృత్రిమ అవయవాలు, వ్యాక్సిన్లు, నూతన మందుల అభివృద్ధితో జీవన కాలం పెరుగుతోందని వెల్లడించారు. అనంతరం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పలు పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు, మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేస్తారా.. వేరొకరిని పెట్టుకోమంటారా?

- విద్యుత్ మీటర్ రీడర్లకు వేతనం చెల్లించకుండా ప్రైవేటు ఏజెన్సీ షాక్
- గతంలో కంటే తక్కువ చెల్లిస్తామంటూ షరతులు
- ఆందోళన బాటలో రీడర్లు

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): 'చేస్తారా.. వేరొకరిని పెట్టుకోమంటారా?' అంటూ విద్యుత్ మీటర్ రీడర్లకు వేతనం చెల్లించకుండా ప్రైవేటు ఏజెన్సీ షాక్ ఇచ్చింది. దీంతో విద్యుత్ మీటర్ల బిల్లులకు రీడింగ్ తీసే రీడర్లు ఆందోళన బాటకు సిద్ధమయ్యారు. నెల నెలా రీడింగ్ తీసే వారికి వేతనాల చెల్లింపులో కొత్తగా వచ్చిన ప్రైవేటు ఏజెన్సీలు అన్యాయం చేస్తున్నాయంటూ నిరసన తెలుపుతున్నారు. ఇప్పటికే రెండు నెలలుగా వేతనాలు చెల్లించకుండా తమను ఇబ్బందులు పెడుతున్నారనీ, మార్చి నెల నుంచి మీటర్ల బిల్లింగ్‌నకు రీడింగ్‌లు తీసేదిలేదంటూ వారు హెచ్చరిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లో విస్తరించిన ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ పరిధిలో 1200 మంది పైనే విద్యుత్ మీటర్ల బిల్లులకు రీడింగ్ తీసేలా రీడర్లు పనిచేస్తున్నారు. వారంతా రీడింగ్ తీసేందుకు కాంట్రాక్టు పొందిన ఏజెన్సీల పరిధిలో పనిచేస్తుంటారు. అయితే గతేడాది వరకు నిబంధనల మేరకు ప్రతి విద్యుత్ మీటర్‌కు రీడింగ్ తీసినందుకు వారికి రూ.3.62 చెల్లించే వారని తెలిపారు. వారికి బ్యాంకు ద్వారా వేతనాలు చెల్లించటంతో పాటు పీఎఫ్, ఈఎస్‌ఐ కూడా చెల్లించేవారు. ఒక రీడర్ 3 వేల నుంచి ఆపైనే విద్యుత్ మీటర్లకు రీడింగ్ తీసి వినియోగదారులకు బిల్లులు అందజేసేవారు. ప్రతి నెలలో ఒకటో తేదీ నుంచి 11వ తేదీ లేదా 13వ తేదీ లోపు రీడింగ్ తీసి బిల్లులు ఇచ్చే ప్రక్రియ పూర్తి చేస్తుంటారు. ఇందులో కొందరు ఇళ్లకు తాళాలు వేసి ఉండటం, కొన్ని మీటర్లకు బిల్లింగ్‌లు జంపింగ్‌లు, మీటర్లు కాలిపోవటం వంటి అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అవన్నింటిని వీరే అధికారుల దృష్టికి తీసుకెళుతుంటారు. ఇలా చేస్తే నెలకు వారికి మొత్తంగా దాదాపుగా రూ. 11 వేలు జమ అవుతుంటాయి. ఇటీవల జనవరి నుంచి కొత్తగా టెండర్ దక్కించుకున్న కాంట్రాక్ట్ ఏజెన్సీ వారు గతంలో రీడింగ్‌కు మీటర్‌కు రూ. 3.62 పైసలు చెల్లించలేమని, మీటర్‌కు రూ. 3.20 మాత్రమే చెల్లిస్తామని వారికి షాకిచ్చారు. సంస్థ నిబంధనల మేరకు టెండర్ దక్కించుకొని తీరా మీటర్ రీడర్లకు అన్యాయం చేస్తే ఎలా అని స్పాట్ బిల్లింగ్ మీటర్ రీడర్స్ అసోసియేషన్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. తాజాగా తగ్గించిన దాంతో ఒక్కో రీడర్‌కు మొత్తంగా వేతనంలో రూ.1200 నుంచి రూ.1500 వరకు కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే జనవరి నెల వేతనాలను జమ చేయలేదనీ, ఫిబ్రవరి నెలవి కూడా చెల్లింపు ప్రక్రియ చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మీటర్ రీడింగ్ నిలిపివేతకు సిద్ధం

సంస్థ నుంచి కాంట్రాక్టు దక్కించుకున్న ఏజెన్సీ వారు మీటర్ బిల్లింగ్ రీడర్లకు నిబంధనల ప్రకారం వేతనాలు చెల్లించకుండా అన్యాయం చేయటం సరికాదని మీటర్ రీడర్స్ అసోసియేషన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు నిరసనగా మార్చి నుంచి బిల్లుల రీడింగ్ నిలిపివేస్తామని అసోసియేషన్ గుంటూరు టౌన్-1 డివిజన్ కార్యదర్శి ఏవీఏ సూర్యనారాయణ మూర్తి తెలిపారు. ఈ మేరకు అసోసియేషన్ నాయకులు ఇప్పటికే తమ సమస్యను ఆ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

గుంటూరు ఛానల్ విస్తరణకు నిధులు

- భూసేకరణకు రూ.100 కోట్లు, విస్తరణకు రూ.300 కోట్లు
- కేంద్ర మంత్రి పెమ్మసాని



సమావేశంలో మాట్లాడుతున్న పెమ్మసాని, ఎమ్మెల్యేలు

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): 2024-25 రాష్ట్ర బడ్జెట్లో గుంటూరు ఛానల్‌కు నిధులు కేటాయించడం హర్షణీయమని గ్రామీణ అభివృద్ధి శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. బడ్జెట్ కేటాయింపులపై గుంటూరులోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, మహమ్మద్ నసీర్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులు పాల్గొన్నారు. పెమ్మసాని మాట్లాడుతూ గుంటూరు ఛానల్ విస్తరణకు నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మంత్రి నారా లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. గుంటూరు పార్లమెంట్లో 50 ఏళ్ల కల అయిన గుంటూరు ఛానల్ విస్తరణ, ఆధునికీకరణ కోసం టీడీపీ ప్రభుత్వం 2014 - 19 కాలంలోనే బడ్జెట్లో ప్రత్యేక నిధులు కేటాయించిందనీ, దాన్ని వైసీపీ నిర్వీర్యం చేయగా, తిరిగి అధికారంలోకి వచ్చిన 8 నెలల కాలంలో మరిన్ని వివరాలు సేకరించి, నూతనంగా డీపీఆర్‌లు తయారు చేయించి, నిధులు కేటాయింపజేయడంలో విజయవంతం అయ్యామని చెప్పారు. 441 ఎకరాల భూసేకరణకు రూ.100 కోట్లు, విస్తరణకు రూ.300 కోట్ల కేటాయించడం హర్షణీయం అన్నారు.

ఆధునికీకరణకు మరో రూ.650 కోట్లకు ప్రతిపాదనలు

ఛానల్ ఆధునికీకరణకు మరో రూ.650 కోట్లకు ప్రతిపాదనలు పెడుతున్నామని, రాబోయే ఎన్నికల్లోపు ఆ విస్తరణతో పాటు ఆధునికీకరణ పనులు కూడా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కృష్ణా పశ్చిమ డెల్టా నుంచి 1200 క్యూసెక్కులను తీసుకు రాగలిగామన్నారు. సహకరించిన మంత్రి నిమ్మల రామానాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. తాను కేంద్ర ప్రభుత్వంలో ఉండడంవల్ల రూరల్ ల్యాండ్ రికార్డులను, అర్బన్ ల్యాండ్ రికార్డులను డిజిటలైజ్ చేయడం కోసం రూ. 400 కోట్ల ఇన్సెంటివ్ అందించగలిగామన్నారు.

ఐసీఐసీఐ కుంభకోణంలో కీలక నిందితుడి అరెస్టు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట ఐసీఐసీఐ బ్యాంక్ కుంభకోణం కేసులో ముఖ్య నిందితుడు సింగు అజిత్ కుమార్‌ను గుంటూరు సీఐడీ పోలీసులు గురువారం రాత్రి అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడైన బ్యాంకు మేనేజర్ నరేష్‌తో కలిసి అజిత్ కుమార్ అక్రమ నగదు లావాదేవీలలో కీలకంగా వ్యవహరించాడు. సుమారు రూ.35 కోట్లు అజిత్ కుమార్ ఖాతాకు బదిలీ అయినట్టు సీఐడీ పోలీసులు గుర్తించారు. చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామంలో అజిత్ కుమార్‌ను సీఐడీ డీఎస్పీ గోలి లక్ష్మయ్య అరెస్టు చేసి విజయవాడ కోర్టులో హాజరు పరిచారు. అనంతరం అతడిని నెల్లూరు జైలుకు తరలించారు. ఈ కేసులో మొత్తం 20 మంది నిందితులు ఉన్నారు. ఇప్పటికి సీఐడీ పోలీసులు 7 గురిని అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడైన బ్యాంకు మేనేజర్ నరేష్ కోర్టులో లొంగిపోయారు. నరేష్ ప్రస్తుతం నెల్లూరు జైల్లో ఉన్నాడు. చిలకలూరిపేట, నరసరావుపేట, విజయవాడ ఐసీఐసీఐ బ్యాంక్ బ్రాంచ్‌లలో మొత్తం రూ. 70 కోట్ల మేరకు కుంభకోణం జరిగింది.

రెవెన్యూ సవరణలు

(5వ పేజీ తరువాయి)

ఉండటంతో వాటి దిద్దుబాటు చేపట్టారు.


అర్జీ అవసరం లేకుండా.. రైతులను తిప్పుకోకుండా..

గడచిన శతాబ్దకాలంగా పదిలంగా ఉన్న ఎందరో భూముల హక్కులు ఒక్క సంవత్సరంలో మారిపోయాయి. ఉదాహరణకు పొన్నూరు పట్టణ పరిధిలో 220 ఎకరాల భూమి కేవలం ఐదుగురు వ్యక్తుల పేరుపై నమోదు చేయడం తెలిసిందే. ఇదే తీరులో ప్రతి గ్రామంలోనూ పదుల సంఖ్యలో పేర్ల మార్పులు జరిగాయి. పొన్నూరులో జరిగిన లోపాలను నేటికీ సరిచేస్తూనే ఉన్నారు. అయితే తెనాలిలో మాత్రం రైతు దరఖాస్తు చేసుకోవడం, కార్యాలయం చుట్టూ తిరగడం, లంచాల రూపంలో చదివించుకోవడం వంటివి లేకుండానే తప్పులు సరిచేస్తున్నారు. ఇప్పటికే సంగంజాగర్లమూడి, కఠెవరం, నందివెలుగు, గుడివాడ, మల్లెపాడు, దేవరపల్లి అగ్రహారం వంటి గ్రామాల్లో రికార్డులను సరిచేశారు. ప్రస్తుతం బుర్రిపాలెం గ్రామాన్ని ఎంపిక చేసుకున్నారు. 291 సర్వే నంబర్లలో మొత్తం 1732 ఎకరాల భూమి ఉంటే యాజమాన్య హక్కులు మారినవి, లెగసీ కేసుల వంటివి ఎక్కువ గుర్తించారు. ఈ గ్రామంలో ఇటీవల రెవెన్యూ సదస్సు పెడితే అధికారులకు భూమి సమస్యలకు సంబంధించి అందిన దరఖాస్తులు కేవలం 2 మాత్రమే. అయితే ఇక్కడ సమస్యలు మాత్రం 100కుపైనే ఉన్నాయి. అంటే ఇద్దరికి మినహా మిగిలిన రైతులకు వారి భూమికి సంబంధించి సమస్య ఉందనే విషయం కూడా తెలియదు. అయితే ఈ మొత్తాన్ని పరిష్కరించి, వాటిని సరిచెయ్యాలని అధికారులు నిర్ణయించారు.

విస్తు కలిగించే విషయాలెన్నో!

- బుర్రిపాలెంలో జగనన్న కాలనీ కోసం మూడేళ్ల క్రితం 198.22 ఎకరాల భూమిని ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసింది. ఇక్కడ ఇళ్ల నిర్మాణం చేపట్టినా ఇంకా రైతుల పేరుపైనే భూమి ఉంది. ప్రభుత్వ భూమిగా మార్చాల్సిన భూమినీ అధికారులు మార్చలేదంటే ఎంత నిర్లక్ష్యమో అర్థమవుతుంది.
- 9999, 99999 ఖాతా నంబర్లలో 196 సర్వే నంబర్లను చేర్చారు. భూ విస్తీర్ణం 460 ఎకరాలపైనే. అయితే ఈ విషయం రైతులకు తెలియదు. దీనిని అధికారులే గుర్తించారు.
- రైతుల పేరు బదులు '0' అని నమోదు చేశారు. దీనివల్ల రైతు తన భూమిని అమ్ముకోడానికి వీలులేని పరిస్థితి.
- లెగసీ కేసులు కూడా చాలానే ఉన్నాయి. ఒక రైతుపేరుపై ఉండాల్సిన వాస్తవ విస్తీర్ణం కాకుండా దానికి మించి కానీ, తక్కువగా కానీ చూపడం, వాటిని మరొకరి పేరుకు చేర్చడం వంటి వాటిని గుర్తించారు.
- 80కిపైగా సర్వే నంబర్లలో అసలు రైతు పేరు కాకుండా ఇతరుల పేర్లు నమోదు చేశారు. రైతు పేరుపై పట్టా, ఇతర హక్కు పత్రాలన్నీ కచ్చితంగా ఉన్నా, వాటిని గతంలో సరిచేసిందేలేదు.
- గ్రామంలో 291 సర్వే నంబర్లుంటే, వీటిలో 60 ఆన్‌లైన్‌లో కనిపించడంలేదు. అవి ఏ రైతులకు సంబంధించినవో అంతుబట్టని విషయం.

సమస్యలన్నీ పరిష్కరించేలా



ఇకపై ఏ రైతూ అంతుబట్టని చిక్కులతో హక్కుల కోసం పోరాడాల్సిన అవసరంలేదు. గతంలో మా వల్ల జరిగిన భూముల తప్పులు మేమే సరిదిద్దాలని నిర్ణయించుకున్నాం. రీ సర్వేలో లోపాలు మళ్లీ కనిపించకుండా, రైతులకు ఏ ఇబ్బంది లేకుండా పరిష్కారం చూపదలిచాం. ఏ ఒక్క రైతు నుంచి భూ సమస్యలపై అర్జీ రాకూడదనే లక్ష్యంతో పని చేస్తున్నాం. ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసుకుని మోడల్‌గా తీర్చిదిద్దాలని ప్రయత్నిస్తున్నాం. మా ప్రయత్నానికి జేసీ, సబ్ కలెక్టర్ పూర్తి సహకారం అందిస్తున్నారు. తప్పులను సరిదిద్దేందుకు ఏ రైతూ లంచం ఇవ్వాల్సిన అవసరంలేదు.

- గోపాలకృష్ణ, తహసీల్దార్, తెనాలి

అమరావతికి అగ్రతాంబూలం

(5వ పేజీ తరువాయి)

అవసరాల నిమిత్తం తాజాగా బడ్జెట్లో మరో 297.82 కోట్లు కేటాయించారు.

నేతన్నలకు ఉచిత విద్యుత్

నేతన్నలు, నాయీబ్రాహ్మణులకు విద్యుత్ భారం తగ్గించే దిశగా చర్యలు చేపట్టింది. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు ఉచితంగా ఇస్తున్నట్లుగానే నేతన్నలకు, నాయీ బ్రాహ్మణులకు ఉచితంగా విద్యుత్ అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకం అందుబాటులోకి వస్తే గుంటూరు జిల్లాలో 10 వేలు, బాపట్ల జిల్లాలో 17 వేలు, పల్నాడు జిల్లాలో 3 వేల చేనేత కుటుంబాలకు భారీ ఊరట లభించనుంది. గతంలో టీడీపీ ప్రభుత్వంలో ప్రారంభించిన ఆదరణ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేయగా, తాజాగా ఆ పథకాన్ని పునఃప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకం పునరుద్ధరిస్తే నాయీబ్రాహ్మణ, రజక, చేనేత, కల్లుగీత కార్మికులు, కుమ్మరి, కమ్మరి ఇతర కుల, చేతి వృత్తులవారికి వృత్తిపరమైన భరోసా లభించే అవకాశం ఉందనడంలో సందేహం లేదు.

దీపం- 2 14 లక్షల మందికి లబ్ధి

దీపం- 2 పథకాన్ని ఇప్పటికే ప్రారంభించిన ప్రభుత్వం గత బడ్జెట్లో ఒక సిలిండరును లబ్ధిదారులకు ఉచితంగా పంపిణీ చేసింది. తాజా బడ్జెట్లో ఈ పథకానికి రూ.2,601 కోట్లు కేటాయించడంతో ఈ ఏడాది మూడు గ్యాసు సిలిండర్లు ఉచితంగా అందనున్నాయి. మూడు జిల్లాల్లోని 14 లక్షల మంది లబ్ధిదారులకు ఈ ఏడాది రూ.357 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది.

అవ్వాతాతల కళ్లలో ఆనందం

అవ్వాతాతలు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు చేయూతనిచ్చే ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌కు భారీగా నిధులు కేటాయించారు. సూపర్ సిక్సులో హామీల్లో కీలకమైన హామీని అధికారంలోకి వచ్చిన తొలి నెలలోనే పింఛను మొత్తాన్ని రూ.4 వేలకు పెంచిన ప్రభుత్వం బడ్జెట్లోనూ అదే ప్రాధాన్యాన్ని కల్పించింది. బడ్జెట్‌లో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని 7లక్షల 40వేల మంది లబ్ధిదారులకు రూ.3,880 కోట్లు కేటాయించింది. బడ్జెట్లోనే కేటాయింపులతో ఏడాది పాటు అవ్వాతాతల పింఛనుకు ఎలాంటి ఢోకా లేకుండా పోయింది.

స్వర్ణాంధ్ర సాధనకు బలమైన బడ్జెట్



బడ్జెట్ ప్రవేశపెట్టే ముందు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

వినుకొండ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యంత ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనకు బలమైన పునాదిగా రాష్ట్ర బడ్జెట్ నిలిచిందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం, దానికి పరిష్కారాలు చూపగల ముఖ్యమంత్రి చంద్రబాబు సామర్థ్యాలకు ఇది నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా రూ.3,22,359 కోట్లతో రూపొందించిన బడ్జెట్‌లో అన్ని రంగాలకు, అన్ని వర్గాలకు అండగా నిలిచే ప్రయత్నం చేశారని హర్షం వ్యక్తం చేశారు. అప్పులు, వడ్డీలకే రూ. 60 వేల కోట్లు కట్టాల్సి వస్తున్న తరుణంలో కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమం కోసం రూ.75 వేల కోట్లు కేటాయించడం హర్షణీయం అన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకం అమలు చేసేందుకు రూ.9,407కోట్లు, అన్నదాత సుఖీభవకు రూ.6 వేల 30 కోట్లు ఇవ్వడాన్ని సూపర్‌సిక్స్ పథకాల అమలులో తిరుగులేని ముందడుగుగా ఆయన పేర్కొన్నారు. ఎన్‌టీఆర్ పెన్షన్లకు రూ.27,518 కోట్లు కేటాయించడం ద్వారా వృద్ధులు, దివ్యాంగులతో సహా లబ్ధిదారులందరికీ భరోసా ఇచ్చారన్నారు. పోలవరానికి రూ.6,705 కోట్లు, అమరావతికి రూ. 6 వేల కోట్లు కేటాయించడం ద్వారా వాటి నిర్మాణంపై పూర్తి విశ్వాసం కలిగించిందని తెలిపారు. విద్యా రంగానికి దాదాపుగా రూ.40 వేల కోట్లు కేటాయింపుతో పెద్దపీట వేయడం అభినందనీయం అన్నారు.

పది పరీక్షల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఆర్జేడీ లింగేశ్వర రెడ్డి

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని ఆర్జేడీ బి.లింగేశ్వర రెడ్డి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ కాన్ఫరెన్స్ హాలులో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్షలు పకడ్బందీగా, పారదర్శకంగా ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్వహించాలని అన్నారు. డీఈవో సి.వి. రేణుక మాట్లాడుతూ జిల్లాలో 150 పరీక్షా కేంద్రాలలో 30,460 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లు పరీక్షల నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలనీ, ఇన్విజిలేటర్లు ఎటువంటి పొరపాట్లు చేయకుండా ఒక రోజు ముందుగానే ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏ ఒక్క విద్యార్థి కూడా నేలపై కూర్చొని పరీక్షలు రాయకూడదనీ, అందరికీ ఫర్నిచర్, మంచి నీరు, విద్యుత్ వసతులు కల్పించాలని సూచించారు. ఈ విషయంలో ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్, కె.వెంకటరెడ్డి, ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి టి.తిరుమలేష్, ఉప విద్యాశాఖాధికారులు ఏసురత్నం, శాంత కుమారి, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

14న పిఠాపురం సభకు భారీగా తరలిరావాలి

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో మార్చి 14న జరిగే రాష్ట్ర జనసేన పార్టీ ఆవిర్భావ సభకు జిల్లా నుంచి భారీ సంఖ్యలో పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు తరలిరావాలని రాష్ట్ర జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, జిల్లా పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు కోరారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో, పిఠాపురం సభను విజయవంతం చేసేందుకు గుంటూరు పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ఉన్న జిల్లా కమిటీ, పట్టణ, మండల, వార్డు అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గుంటూరు పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల నాయకులు స్థానికంగా సమావేశాలు ఏర్పాటు చేసుకొని సభకు తమ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో పాల్గొనేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. కార్పొరేటర్లు సంకూరి శ్రీనివాసరావు, నిమ్మల రమణ, ఐశెట్టి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.85
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	87, 99, 108
చికెన్ విత్ స్కిన్	172.00
చికెన్ స్కిన్ లెస్	182.00

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

● గంటముందుగా కేంద్రాలకు రావాలి : ఆర్ఐవో

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు ఇంటర్ బోర్డు ఆర్ఐవో జుబేర్ వెల్లడించారు. విద్యార్థినీ, విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు కనీసం గంట ముందుగా చేరుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 34,273 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 34,973 మంది, ఇంటర్ మొదటి సంవత్సరం వృత్తివిద్యాకోర్సుల పరీక్షలకు 1215 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 867 మంది చొప్పున మొత్తం 71,528 మంది విద్యార్థినీ, విద్యార్థులు పరీక్ష హాజరుకానున్నారు. ఇంటర్ పరీక్షల కోసం 81 పరీక్షా కేంద్రాలు ఉన్నాయని, ఆయా కేంద్రాల్లో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. ప్రశ్నా పత్రాల కోసం 16 స్టోరేజ్ కేంద్రాలు(పోలీసు స్టేషన్స్) ఉన్నాయి. పరీక్షల పర్యవేక్షణ కోసం 83 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, మరో 83 మంది డిపార్టుమెంట్ ఆఫీసర్లను ప్రభుత్వం నియమించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, పరీక్షలు జరిగే సమయంలో కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్స్ మూసివేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అంతేకాకుండా కాపీయింగ్‌కు అవకాశం లేకుండా నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఉంటాయన్నారు.

రోగులకు బియ్యం, దుప్పట్లు వితరణ

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు శుక్రవారం షాపర్స్ స్టాప్ వారు 250 కిలోల బియ్యం, 30 దుప్పట్లు అందజేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, షాపర్స్ స్టాప్ సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో షాపర్స్ స్టాప్ జోనల్ హెచ్‌ఆర్ హెడ్ హరిప్రసాద్, హెచ్‌ఆర్ హెడ్ సుధశ్రీ, గుంటూరు మేనేజర్ సరోజ్ పాండా, అడ్మిన్ వాసు తదితరులు పాల్గొన్నారు.

రాయితీ ధరలతో వైద్య పరీక్షలు

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మార్చి ఒకటి నుంచి 31వ తేదీ వరకు మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం అత్యంత రాయితీలతో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ టీ.సేవకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బ్రాడీపేట 2/1లోని సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో, కొత్తపేటలోని ధర్మభవన్‌లో 86 రకాల కంప్లీట్ హెల్త్ చెకప్ పరీక్షలు రాయితీ ధరలతో నిర్వహిస్తామని ఆయన వివరించారు. ఈనెల 9న ఉదయం బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌వో భవన్‌లో మహిళల ఆరోగ్య సమస్యపై శాస్త్రీయ అవగాహన సభ నిర్వహిస్తామని డాక్టర్ సేవకుమార్ తెలిపారు.

ప్రజల ఆశలు వమ్ము చేసిన బడ్జెట్

● మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి

గుంటూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ హామీలు నమ్మి ప్రజలు అత్యధిక సీట్లతో గెలిపిస్తే రాష్ట్ర ప్రజల ఆశలను వమ్ము చేసేలా ప్రభుత్వం బడ్జెట్ రూపొందించిందని మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి విమర్శించారు. బడ్జెట్ కేటాయింపుల నేపథ్యంలో బారాయిమాంపంజాలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దాదాపు రూ.3 లక్షల కోట్లపైనే ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఏ మాత్రం చిత్తశుద్ధి కనిపించలేదని విమర్శించారు. 2014 నుంచి నేటి వరకు రాష్ట్ర రాజధాని కట్టలేని అసమర్థ ప్రభుత్వాలు పాలన చేస్తున్నాయని ధ్వజమెత్తారు. రైతులు గిట్టుబాటు ధరల్లేక రోడ్లపైకి ఎక్కుతున్నారన్నారు. కేవలం ప్రకటనలు కాకుండా ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రేపటి నుంచి మారుతీ దేవాలయ బ్రహ్మోత్సవాలు

గుంటూర(తూర్పు), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక మారుతీనగర్, మారుతీ దేవాలయ 39వ వార్షిక బ్రహ్మోత్సవాలు మార్చి 2 నుంచి 6 వరకు జరుగుతాయని ఆలయ కమిటీ కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 2న శ్రీ సిద్ధి, బుద్ధి సమేత శ్రీ విఘ్నేశ్వరస్వామి కల్యాణం, 3న గంగా గౌరీ సమేత శ్రీ గౌరీశంకర స్వామి కల్యాణం, నగరోత్సవం, 4న సువర్చలా సమేత శ్రీ ప్రసన్నాంజనేయస్వామివారి కల్యాణం, సువాసినులచే సామూహిక కుంకుమ పూజలు, 5న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం, సామూహిక తులసి పూజలు, 6న శ్రీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం, తూర్పు రాజగోపుర కలశస్థాపన ప్రతిష్ఠా మహోత్సవాలు, మధ్యాహ్నం యాగ పూర్ణాహుతి, భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగునన్నారు.

ఊపిరితిత్తుల వ్యాధులపై రేపు ఆరోగ్యసభ

గుంటూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులపై అరండల్‌పేట 15/1వ లైనులోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం ఉదయం ఆరోగ్య సభ నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్యసభకు ప్రముఖ చెస్ట్ ఫిజీషియన్ డాక్టర్ ఎస్.రఘు హాజరై ప్రసంగిస్తారన్నారు. అలర్జీ, ఆస్తమాతో పాటు ఆయాసం, నెమ్ము, హెచ్‌వీ, ఛాతి నొప్పులు, ఊపిరి తిత్తుల క్యాన్సర్ వంటి వ్యాధులపై అవగాహన కల్పించటంతో పాటు జాగ్రత్తలు వివరిస్తారన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా వికాస్ నగర్ 4వ లైన్ నుంచి 11వ లైన్‌ల వరకు, నవభారత్‌నగర్ రెండో లైను నుంచి 4/3వ లైను వరకు శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ఎన్.గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

డ్రెయిన్ల తర్వాతే రోడ్ల నిర్మాణం చేపట్టాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు



రెడ్డిపాలెం రోడ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో నూతనంగా రోడ్లు ఏర్పాటు చేసే ప్రాంతాల్లో తొలుత డ్రెయిన్ల నిర్మాణం చేసిన అనంతరమే రోడ్ల నిర్మాణం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రెడ్డిపాలెం, గోరంట్ల, ఇన్నర్ రింగ్‌రోడ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ డివిజన్ల వారీగా ఎండ్ టు ఎండ్ నూతన రోడ్ల ఏర్పాటు ప్రతిపాదనలు ఉండాలన్నారు. పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనుల నాణ్యతపై ఫిర్యాదులు అందుతున్నాయని, పనులు జరిగే సమయంలో ఎమినిటి కార్యదర్శులు, ఏఈలు తప్పనిసరిగా పర్యవేక్షణ చేయాలన్నారు. పారిశుధ్య పనులు పిన్ పాయింట్‌గా జరగాలని ప్రజారోగ్య అధికారులకు, శానిటేషన్ కార్యదర్శు లకు స్పష్టం చేశారు. పర్యటనలో డీఈఈ రమేష్ బాబు, ఆర్‌వో రవికిరణ్ రెడ్డి, ఎస్ఎస్ ఆయూబ్ ఖాన్, ఏఈలు, టీపీఎస్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

వాట్సాప్ నెంబర్ ద్వారా గవర్నెన్స్ సేవలు : కమిషనర్

ఏపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 95523 00009 నంబర్ ద్వారా వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ప్రారంభించిందని, ప్రజలు కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగకుండా, వారి అవసరాలకు అనుగుణంగా సేవలు ఇంటి దగ్గర నుంచి అందించడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ ఆస్తి, ఖాళీ స్థల, నీటి మీటర్ల పన్ను విధింపు, చెల్లింపు, వివాహ నమోదు, డ్రైనేజ్ కనెక్షన్, నూతన ట్రేడ్ లైసెన్స్ దరఖాస్తు, ఫీజుల చెల్లింపు వడ్డీ ఇలా 32 మున్సిపల్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ప్రజలు తమ వినతుల్ని, ఫిర్యాదుల్ని ఈ వాట్సాప్ నంబర్‌కు మెసేజ్ చేసిన వెంటనే ఓ లింక్ వస్తుందని, అందులో పేరు, మొబైల్ నంబర్, అడ్రస్ నమోదు చేసి, వినతి, సమస్య ఏంటో టైప్ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రక్రియ తర్వాత వారికి ఒక రిఫరెన్స్ నంబరు పంపిస్తారని, దాని ద్వారా ప్రజలు తమ వినతికి సంబంధించిన స్టేటస్‌ను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవచ్చని తెలిపారు.

అణగారిన వర్గాల హక్కుల సాధనలో రచయితల పాత్ర మరువలేనిది

● కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తమ ఉనికి కోసం, పీడన విముక్తి కోసం దళితులు, మైనార్టీ వర్గాలు, స్త్రీలు, బాధితులు చేపట్టిన ఉద్యమాలలో అభ్యుదయ రచయితలు కీలక పాత్ర పోషిస్తున్నారని అరసం జాతీయ అధ్యక్షుడు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. బ్రాడీపేట, యూటీఎఫ్ కార్యాలయంలో జాషువా కల్చరల్, భీమ్‌సేన సేవా దళ్ ఆధ్వర్యంలో శుక్రవారం డాక్టర్ కోయి కోటేశ్వరరావు కవితా సంపుటి 'నాగస్వరం' సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఏది తినాలో, ఏ వస్త్రం ధరించాలో, ఏ పుస్తకం చదవాలో శాసించే స్థాయికి నేటి హిందూ మతోన్మాద శక్తులు చేరాయని అన్నారు. ఈ నేపథ్యంలో లౌకికవాద, ప్రజాస్వామ్య శక్తులు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. సభకు ఏసీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ముత్యం అధ్యక్షత వహించగా, కార్యక్రమంలో గుంటూరు లక్ష్మీనరసయ్య, ఎస్.బాలస్వామి, విద్యాసాగర్, శ్రీరాములు, సుధాకర్, శశిధర్, నాగభూషణం, శ్రీనివాస్, నల్లపు నీలాంబరం తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న పెనుగొండ లక్ష్మీనారాయణ, పాల్గొన్న సాహితీ వేత్తలు

గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రంపై విజిలెన్స్ దాడులు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్‌ను వ్యాపార సంస్థలకు దారిమళ్లిస్తున్న నగరంలోని ఏటుకూరు రోడ్డులో ఉన్న రీఫిల్లింగ్ కేంద్రంపై గుంటూరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మెరుపు దాడి నిర్వహించారు. విజిలెన్స్ ఎండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ దువ్వారపు సూర్య శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు ఈ దాడులు జరిగాయి. గుంటూరుకు చెందిన అడపా పవన్ కుమార్, అడపా శ్రీనివాస్ గృహ అవసరాలకు ఉపయోగించవలసిన సబ్సిడీ డొమెస్టిక్ సిలిండర్లను అక్రమ మార్గంలో వివిధ గ్యాస్ ఏజెన్సీల డెలివరీ బాయ్స్ నుంచి సేకరించి అందులో ఉన్న గ్యాస్‌ను కమర్షియల్ సిలిండర్లలో నింపి బ్లాక్ మార్కెట్లో ఎక్కువ రేటుకు అమ్ముతున్నట్లు గుర్తించారు. తనిఖీలలో భాగంగా 22 డొమెస్టిక్ సిలిండర్స్, 68 కమర్షియల్ సిలిండర్స్, గ్యాస్ సిలిండర్స్ అక్రమ రవాణాకు ఉపయోగిస్తున్న రెండు ఆటోలు కూడా సీజ్ చేశారు. అడపా పవన్ కుమార్, అడపా శ్రీనివాస్‌లపై క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ సీఐ కొమ్మాలపాటి చంద్రశేఖర్, ఏవో ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



ఏటుకూరు రోడ్డులో విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్ బృందం స్వాధీనం చేసుకున్న గ్యాస్ సిలిండర్లు

వీనుల విందుగా వీణానాదార్చన

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేట, ఓంకార క్షేత్రంలోని శ్రీ భారతీ సంగీత నిలయం వ్యవస్థాపక అధ్యక్షురాలు భారతీదేవి శిష్యబృందంతో జరిగిన వీణాకచేరి వీనుల విందుగా సాగింది. కచేరిలో మృదంగంపై జగన్మోహిని, శిష్యులు కె.మృణాలిని, నాగలక్ష్మి, భవాని, వర్ధని పాల్గొన్నారు. ఆలయ కమిటీ కార్యదర్శి నంబూరు వేంకట నారాయణమూర్తి కళాకారులను ఘనంగా సత్కరించారు.

ఉద్యోగులను నిరాశపరచిన బడ్జెట్ : ఏపీటీఎఫ్

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఉద్యోగులకు వేతన సవరణకు సంబంధించి ఎటువంటి నిధులు కేటాయించకపోవడం ఉద్యోగుల్లో తీవ్ర నిరాశ నింపిందని ఆంధ్రప్రదేశ్ టీచర్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు 12వ వేతన సవరణకు సంబంధించి ఇప్పటికే రెండు సంవత్సరాలు ఆలస్యమైనప్పటికీ ఎన్నికల ముందు ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చిన ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిని అసలు పట్టించుకోకపో వడం, అదేవిధంగా బకాయిలుగా ఉన్న కరువు భత్యం ఇప్పటివరకు ఒకటి కూడా చెల్లింపు చేయకపోవడం ఉద్యోగుల సంక్షేమంపై ఈ ప్రభుత్వానికి గల నిర్లక్ష్యానికి నిదర్శనమే నేటి బడ్జెట్లో వేతన సవరణకు ఎటువంటి నిధులు కేటాయించకపోవడం అని అన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలలో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలి : సీపీఎం

గుంటూరు(తూర్పు) ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో అధికార పార్టీ చేసిన అక్రమాలపై విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వైనేతాజీ డిమాండ్ చేశారు. బ్రాడీపేట సీపీఎం కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాలలో ప్రత్యర్థి ఏజెంట్లను బెదిరించి, దాడులకు పాల్పడ్డారని అన్నారు. అక్రమాలపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, ప్రేక్షక పాత్ర పోషించారని ఆరోపించారు. దాడులు, అక్రమాలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పాశం రామారావు, ఈమని అప్పారావు, కే నళినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మహా కుంభాభిషేకం మహోత్సవాలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం నుంచి మహాసంప్రోక్షణ సహిత మహా కుంభాభిషేకం మహోత్సవాలు ప్రారంభమవుతున్నాయి. ఆలయాన్ని నిర్వాహకులు ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో హోమాలు, పూర్ణాహుతి నిర్వహిస్తున్నారు. వారం రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటి అధ్యక్షుడు మస్తానయ్య, కార్యదర్శి బొర్రా నాగేశ్వరరావు కోరారు.

పోలీసులు ఆరోగ్యంతో ఉద్యోగ విరమణ చేయడం అదృష్టం

● ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : సుదీర్ఘ కాలం పోలీస్ శాఖకు సేవలందించి ఆరోగ్యంతో ఉద్యోగ విరమణ చేయడం అదృష్టంగా భావించాలని ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన ముగ్గురిని ఘనంగా సన్మానించారు. 40 సంవత్సరాలు దీర్ఘకాలంగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఎస్సైలు సీహెచ్ వెంకటేశ్వర్లు, కొట్టి శ్రీహరి, హెడ్ కానిస్టేబుల్ ఎండి ఖాసీం తదితరులను పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి, సత్కరించారు. వివిధ స్థాయిల్లో పోలీస్ శాఖకు సేవలందించడం సామాన్య విషయం కాదని, అప్పట్లో నక్సలిజం, అరకొర సదుపాయాలు, రవాణా సౌకర్యాల కొరత మొదలగు ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ఆరోగ్యంగా ఉద్యోగ విరమణ చేయడమనేది అదృష్టమన్నారు. తమ విధి నిర్వహణ కొరకు అనువైన వాతావరణం కలిపించి, తమకు సహకరించిన ఎస్పీకి వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు జీవీ రమణమూర్తి, హనుమంతు, ఏఓ అద్దంకి. వెంకటేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలురెడ్డి, ఎస్‌బీ సీఐ అళహరి శ్రీనివాస్, డీసీఆర్‌బీ సీఐలు నాగమల్లేశ్వరరావు, నరసింహారావు, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, రామకృష్ణరెడ్డి, రాష్ట్ర పోలీస్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దళవాయి సుబ్రహ్మణ్యం, జిల్లా పోలీస్ అసోసియేషన్ సభ్యులు మైలా సాంబశివరావు, లక్ష్మయ్య, హుస్సేన్, సహోద్యోగులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను సత్కరిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, అధికారులు

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రదర్శన తిలకిస్తున్న విద్యార్థులు

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవ నిర్వహించారు. కళాశాల కెమిస్ట్రీ, బోటనీ, ఫిజిక్స్ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనకు పెద్ద సంఖ్యలో విద్యార్థినీ, విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థుల్లో సైన్స్‌పై అవగాహన కలిగించడానికి ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ వీఆర్ జ్యోత్స్న కుమారి తెలిపారు. కళాశాల సమీపంలోని పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శన తిలకించారు.

సుమేధా స్కూలులో

స్థానిక ఎన్జీవో కాలనీలోని సుమేధ స్కూల్లో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖరరెడ్డి, ఛైర్‌పర్సన్ మల్లేశ్వరి విద్యార్థినీ, విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించారు. విద్యార్థుల్లో వైజ్ఞానిక జిజ్ఞాసను పెంచడానికి సైన్స్ ప్రదర్శనలు ఉపయోగపడతాయని తెలిపారు.

శ్రీ చైతన్య పాఠశాలలో..

స్థానిక శ్యామలనగర్‌లోని శ్రీ చైతన్య స్కూల్లో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయుష్మాన్ హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ రాకేష్ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులలో సృజనాత్మక నైపుణ్యాలను పెంపొందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య, కో ఆర్డినేటర్ సచ్చిదానందమూర్తి, ఏవో శివకుమారి పాల్గొన్నారు.

శ్రీ చైతన్య టెక్నో కరిక్యులం స్కూల్‌లో...

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురంలోని శ్రీ చైతన్య టెక్నో కరిక్యులం స్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఎక్స్‌పోని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్‌వీఎస్ఎన్ రవికుమార్ ప్రారంభించి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సైన్స్‌లో నిత్యం కొత్త ఆవిష్కరణలు జరుగుతుంటాయని, లేటెస్టు టెక్నాలజీని ఎప్పటికప్పుడు విద్యార్థులు అందిపుచ్చుకున్నప్పుడే ఉన్నతస్థాయికి చేరుకోగలరని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం నూతలపాటి అంజయ్య, ప్రిన్సిపాల్ ఎం.వినీత, అకడమిక్ కో-ఆర్డినేటర్ కే.సచ్చిదానందమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కన్నా ఉన్నత పాఠశాలలో...



ప్రదర్శన తిలకిస్తున్న కన్నా మాస్టారు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆది మానవుడి నుంచి నేటి ఆధునిక ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ యుగం వరకు మనిషి ఎదుగుదలకు ఎందుకు? ఎలా? ఏమిటి? అన్న ప్రశ్నల నుంచి వైజ్ఞానాభివృద్ధి చెందిందని, విద్యార్థి దశలో సృజనాత్మకతతో కూడిన శాస్త్రీయ ఆలోచనలకు శ్రీకారం చుట్టి దేశం గర్వించదగ్గ మేధోసంపన్న విద్యార్థులుగా ఎదగాలని కన్నా విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ కన్నా మాస్టర్ అన్నారు. స్థానిక రైలుపేట కన్నా ఉన్నత పాఠశాలలో సర్ సీవీ రామన్ జయంతి పురస్కరించుకొని శుక్రవారం 'జాతీయ సైన్స్ దినోత్సవం' సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కన్నా మాస్టర్ మాట్లాడుతూ సైన్స్ బోధనాంశాలను నేర్పటంతో పాటు మోడల్స్ ప్రయోగాలు ద్వారా విద్యార్థుల జ్ఞాపకశక్తి శాశ్వతంగా నిలిచిపోతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే నసీర్ తదితరులు

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకుంటే ఉన్నతంగా రాణిస్తారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. రంజాన్ సందర్భంగా గుంటూరులోని అంజుమన్- ఎ- ఇస్లామియా ఆధ్వర్యంలో విద్యార్థులకు రంజాన్ వ్యాస రచన పోటీలలో విజేతలకు శుక్రవారం ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మొహమ్మద్ ప్రవక్త గురించి అవగాహన పెంపొందించేలా పోటీ పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. పవిత్ర ఖురాన్ గ్రంథంలోని కరుణ, ప్రేమ, దయ, ఎదుటివారికి సాయపడటం వంటి సద్గుణాల గురించి తెలుసుకోవాలని సూచించారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్రాంతి సంబరాలు, క్రిస్మస్ వేడుకలు నిర్వహించామని, ఇప్పుడు రంజాన్ సందర్భంగా పోటీ పరీక్షలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తున్నామని వెల్లడించారు. అనంతరం ప్రథమ బహుమతిగా రూ.50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.30 వేలు, తృతీయ బహుమతిగా రూ.20 వేలు, రూ.లక్ష విలువైన కన్సొలేషన్ బహుమతులు ప్రధానం చేశారు. అంజుమన్-ఎ-ఇస్లామియా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర నిర్మాణానికి బాటలు

● ఏపీఐడీసీ ఛైర్మన్ డేగల ప్రభాకర్



గుంటూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి పూర్తిస్థాయి బడ్జెట్లో సంక్షేమం, అభివృద్ధి, హామీల అమలుకు సమ ప్రాధాన్యమిచ్చి స్వర్ణాంధ్ర నిర్మాణానికి బాటలు వేసిందని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఐడీసీ) ఛైర్మన్ డేగల ప్రభాకర్ అన్నారు. టీడీపీ నగర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పేద, మధ్య తరగతి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, వైసీపీ చేసిన విధ్వంసాల నుంచి వ్యవస్థలను పునరుద్ధరిస్తూ అనేక సవాళ్లను, సంక్లిష్ట పరిస్థితులను అధిగమించి రాష్ట్రాన్ని పునర్నిర్మించేలా బడ్జెట్‌ను రూపొందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వపు దుర్మార్గపు పన్నులు తొలగిస్తూ ప్రజలపై ఎటువంటి కొత్త పన్నుల భారం మోపకుండా రాష్ట్రానికి ఆదాయం సమకూరేల బడ్జెట్‌ను రూపొందించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలకు బడ్జెట్లో అధిక ప్రాధాన్య ఇవ్వడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి అద్దం పడుతుందన్నారు. రైతు సంక్షేమ ప్రధానం అన్న విషయం ఈ బడ్జెట్ కేటాయింపుల ద్వారా మరోసారి స్పష్టమైందన్నారు. గత ప్రభుత్వ అసమర్థత వల్ల నిర్వీర్యమైన వైద్య రంగాన్ని గాడిలో పెట్టేలా బడ్జెట్లో పెద్ద ఎత్తున 19,265 కోట్ల నిధులు కేటాయించారన్నారు. సంక్షేమ పథకాలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉప ప్రణాళికలకు కేటాయింపులు పెంచడం జరిగిందన్నారు.

ప్రజా ప్రభుత్వంలో ప్రజల బడ్జెట్

● రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ



గుంటూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): 'అణుదాడిలో విధ్వంసమైన హిరోషిమా నగరం లేచి నిలబడగా లేనిది, ఆర్థిక విధ్వంసం జరిగిన ఏపీని తిరిగి నిలబెట్టలేమా?' అన్న సీఎం నారా చంద్రబాబు మాటల స్ఫూర్తితో రూపొందిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ 2025-26లో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసే విధంగా కేటాయింపులు చేయడం అభినందనీయమని రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ వ్యాఖ్యానించారు. గుంటూరులోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కీలక రంగాలు, సంక్షేమ పథకాలకు భారీగా నిధులు కేటాయించడంతో పాటు, తెలుగు భాషాభివృద్ధికి రూ.10 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించడం తెలుగు భాషకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని తెలియజేస్తోందన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడానికి బడ్జెట్లో కేటాయింపులు ఉండటం శుభపరిణామమన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలకు బడ్జెట్ కేటాయింపులు కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. రాష్ట్రాన్ని సస్యశ్యామలంగా మార్చేలా జలవనరుల శాఖకు అధిక కేటాయింపులు చేశారని తెలిపారు.

నవ్వుతూ చేసిన పాపాలు.. ఏడుస్తూ అనుభవించాల్సిందే

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి



గుంటూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి అండతో నాడు నవ్వుతూ చేసిన పాపాలు నేడు ఏడుస్తూ అనుభవించక తప్పదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డబ్బు కోసం, పదవుల కోసం ఉచ్చ నీచాలు మరచి చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ కుటుంబ సభ్యులను అతి జుగుప్సాకరంగా అవమానించిన నీచులు పోసాని కృష్ణ మురళి, వంశీ, కొడాలి నాని, గోరంట్ల మాధవ్, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, రోజారెడ్డి ఇప్పుడు నీతి సూత్రాలు వల్లించటం సిగ్గు చేటని అన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసి, 45 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన జాతీయ నాయకుడైన చంద్రబాబు సైతం 19 మంది శాసనసభ్యులతో దమ్ముగా, ధైర్యంగా ప్రజా సమస్యలపై అసెంబ్లీలో ఒంటరి యుద్ధం చేసారని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు సింహం సింగిల్‌గా వస్తుంది, వై నాట్ 175, 30 సంవత్సరాలు తానే సీఎంగా ఉంటానని రెచ్చిపోయి మాట్లాడిన జగన్ రెడ్డి నేడు అసెంబ్లీ లోకి రావాలంటే ఎందుకు వణికి పోతున్నాడని ప్రశ్నించారు. అసెంబ్లీకి రాకుండా ప్రజలివ్వని ప్రతిపక్ష హోదా కోసం వెంపర్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు.

ఘనంగా సంగీత రత్న బిరుదు పురస్కార ప్రదానం



రమ్య కిరణ్మయికి యువ సంగీత రత్న పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శుక్రవారం గాయత్రీ మహిళా సంగీత సన్మండలి సంగీత సభా కార్యక్రమం జరిగింది. కార్యక్రమాల్ని మందపాటి నీరజ కిరణ్ ప్రారంభించగా, ముఖ్య అతిథిగా ఎం. రమణ ప్రసాదు, ఆత్మీయ అతిథిగా ప్రవాసాంధ్రుడు మైలవరపు కృష్ణ హాజరయ్యారు. అనంతరం యువ కళాకారిణి విదుషి చాగంటి రమ్య కిరణ్మయి, చెన్నై వారిని అతిథులు, సంస్థ వారు యువ సంగీత రత్న పురస్కారంతో ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన చాగంటి రమ్య కిరణ్మయి శాస్త్రీయ సంగీత గాత్ర కచేరీ శ్రావ్యంగా సాగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య పాల్గొనగా, కార్యక్రమాల్ని గాయత్రి సంగీత మండలి అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పి.విజయ పర్యవేక్షించారు.

ఆనాడు యరపతినేని చొరవతోనే అధికారం

● టీడీఎల్పీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



పిడుగురాళ్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): 2014 రాష్ట్ర విభజన సంక్షోభ సమయంలో గురజాల నియోజకవర్గంలో యరపతినేని శ్రీనివాసరావు చూపిన చొరవను ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం మరోసారి గుర్తుచేశారు. బడ్జెట్ అనంతరం టీడీఎల్పీ సమావేశం జరగ్గా అందులో చంద్రబాబు గురజాల గురించి, ఎమ్మెల్యే యరపతినేని గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. 2014లో రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడానికి గురజాల నుంచి నాంది పలికిందన్నారు. 2013 సెప్టెంబరు 1న ఆత్మగౌరవ యాత్ర ఎక్కడి నుంచి చేపట్టాలని ఆలోచన చేస్తున్న సమయంలో నేనున్నానంటూ యరపతినేని ముందుకు వచ్చారన్నారు. గురజాల నుంచి యాత్రను ప్రారంభించాలని కోరారన్నారు. దీంతో అక్కడి నుంచే ఆత్మగౌరవయాత్ర మొదలుపెట్టడం జరిగిందన్నారు. గురజాల స్పందనతో రాష్ట్రంలో పర్యటన కొనసాగించానని, దీంతో టీడీపీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఆనాడు యాత్ర చేపట్టేందుకు యరపతినేని ముందుకు రావడం, విజయవంతం చేసేందుకు చేసిన కృషి నాకింకా గుర్తేనని చంద్రబాబు ప్రస్తావించారు.

ఎయిమ్స్‌లో మెరుగైన వసతుల కల్పనకు చర్యలు

● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

● మంగళగిరి ఎయిమ్స్‌లో వైద్య సేవలపై ఆరా

● రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న పెమ్మసాని

● ఎయిమ్స్ అభివృద్ధిపై వైద్యాధికారులతో సమీక్ష



ఎయిమ్స్‌లో వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకుంటున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

మంగళగిరి సిటీ ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయ భాగస్వామ్యంతో మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రిలో రోగులకు మరిన్ని మెరుగైన వసతులను కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. మంగళగిరిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఎయిమ్స్‌లో ఇన్‌పేషెంట్, అవుట్ పేషెంట్, ఎమర్జెన్సీ, ఆపరేషన్ థియేటర్లు, ఇతర విభాగాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఎయిమ్స్‌లో అందుతున్న వైద్య సేవలపై అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమావేశ మందిరంలో ఎయిమ్స్ అధికారులు, వైద్యులతో ఆసుపత్రి పురోభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ పెమ్మసాని మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత ఏపీలో ప్రఖ్యాత ఎయిమ్స్ వైద్యశాల వుంటే ప్రజల ఆరోగ్యానికి భరోసా ఏర్పడుతుందని సీఎం చంద్రబాబు మంగళగిరిలో ఎయిమ్స్ ఆసుపత్రిని ఏర్పాటు చేయించారని చెప్పారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ ఎయిమ్స్‌కు అవసరమైన విద్యుత్, మంచినీటిని అందించడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎయిమ్స్‌కు పదెకరాల అదనపు స్థలంతోపాటు విద్యుత్, మంచినీటి సరఫరాను అందించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు ఎయిమ్స్‌లో ఏడున్నర లక్షల మందికి పైగా అవుట్ పేషెంట్ రోగులు వైద్య సేవలు పొందారని, ప్రతిరోజు సుమారు 3,200 ఓపీ నమోదవుతుందని, రాబోయే రోజుల్లో ఈ సంఖ్య రెట్టింపు అవుతుందని చెప్పారు. అందుకు అనుగుణంగా ఇప్పటినుంచే ప్రణాళికాబద్ధమైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం వుందన్నారు. తన పరిశీలనలో 95 శాతం మంది రోగులు వైద్య సేవలు, సౌకర్యాలపై సంతృప్తిని వ్యక్తం చేశారన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా మంగళగిరి ఎయిమ్స్‌లో వైద్యం అందుబాటులో వుందన్నారు. అయితే, 960 బెడ్లు అవసరం వుండగా ప్రస్తుతం 600 మాత్రమే అందుబాటులో వున్నాయని, ఐసీయూలో 96 బెడ్లు అవసరం వుండగా ప్రస్తుతం 20 మాత్రమే అందుబాటులో వున్నాయని చెప్పారు. ఫార్మసీలో మెడికల్ స్టోర్స్ షార్టేజీ, ప్రజలకు రవాణా సౌకర్యం, బస్సు షెల్టర్లు లేకపోవడం వంటి సమస్యలను గుర్తించామని, త్వరలోనే వాటన్నింటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మంత్రి నారా లోకేశ్ సీఎస్ఆర్ ద్వారా రెండు షటిల్ బస్సు సర్వీసులను నడిపే ఏర్పాటు చేశారని, ఎన్నికల కోడ్ ముగియగానే ఆ సర్వీసులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఇన్‌పేషెంట్ తాలూకా కుటుంబ సభ్యులు రోజుల తరబడి ఆసుపత్రిలోనే వుండాల్సిన పరిస్థితులు వున్నాయని, వారి సౌకర్యార్థం ధర్మశాల భవనాన్ని మరింత విస్తరిస్తామని చెప్పారు. ప్రైవేటు అంబులెన్స్‌ల వారు అధిక మొత్తంలో చార్జీలు వసూలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై పరిశీలన జరిపి కిలోమీటరు చొప్పున నిర్ణీత ధరలతో త్వరలోనే బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే, ఉద్యోగులు, సిబ్బంది నియామకాల్లో అవకతవకలు జరిగినట్టుగా తమ దృష్టికి వచ్చిందని, ఆ ఆరోపణలపై విచారణ జరిపిస్తామని, ఎయిమ్స్‌లో క్యాంటీన్ల నిర్వహణ కోసం మరిన్ని టెండర్లు పిలుస్తామని మంత్రి పెమ్మసాని స్పష్టం చేశారు. ఎయిమ్స్‌లో రోగులు, వైద్యులు, విద్యార్థులు, సిబ్బందికి అవసరమైన కనీస సదుపాయాలను త్వరితగతిన పూర్తిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అహంతెమ్ శాంతా సింగ్, వైద్యాధికారులు పాల్గొన్నారు.



జన ఔషధి విభాగాన్ని పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి

ఆధునిక అంశాలపై పట్టు సాధించాలి

● మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్పీ ఠాకూర్



ప్రసంగిస్తున్న రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్పీ ఠాకూర్

పెదకాకాని, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నేటితరం విద్యార్థులు, యువత ఆధునిక అంశాలపై పట్టు సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏపీ మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్పీ ఠాకూర్ సూచించారు. విశ్వవిద్యాలయంలోని కామర్స్ విభాగం, ఆంధ్రప్రదేశ్ యంగ్ థింకర్స్ ఫోరం సంయుక్తంగా ఫ్రమ్ స్టూడెంట్ టు ఎక్స్‌పెర్ట్ లీడర్షిప్ పైప్ లైన్ ఫర్ మోడ్రన్ వర్క్ ప్లేస్ అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్పీ ఠాకూర్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా తమను తాము మలుచుకోవాలని, అందుకోసం ప్రత్యేక శ్రద్ధ వహించి వివిధ ఆధునిక అంశాలపై పట్టు సాధించాలని సూచించారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వీటిలో వ్యాపార స్థాపన, అభివృద్ధి వైపు యువత అడుగులు వేయాలని పేర్కొన్నారు. స్వీయ నిర్వహణ, వ్యక్తిత్వ వికాసం కోసం పుస్తక పఠనం కొనసాగించాలని చెప్పారు. కార్యక్రమానికి విభాగాధిపతి ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్ అధ్యక్షత వహించి మాట్లాడారు. విద్యార్థుల్లో నిత్యం కొత్త అంశాల పట్ల అవగాహన కల్పించే విధంగా ఇటువంటి ఉపన్యాస కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. థింకర్స్ ఫోరం ఎన్ఐటీ వరంగల్ నుంచి డాక్టర్ కె. వెంకట కృష్ణారావు, వాణిజ్య విభాగం అధ్యాపకులు డాక్టర్ ఎన్.రత్న కిషోర్, డాక్టర్ ఎ.కనకదుర్గ, డాక్టర్ జి.నాగరాజు, డాక్టర్ వి.విష్ణు, డాక్టర్ కే.సుధీర్ కుమార్, డాక్టర్ చంద్రబాను రెడ్డి, డాక్టర్ కృష్ణకుమారి, డాక్టర్ రఫీ, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లకు చేరుకున్న బ్యాలెట్ బాక్సులు

● ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, జేసీలు

● పటిష్ట బందోబస్తు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్‌తేజ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాలకు జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులు గుంటూరు ఏసీ కళాశాలలో ఉన్న స్ట్రాంగ్ రూమ్‌లకు చేరుకున్నాయి. మొత్తం ఆరు జిల్లాలకు చెందిన బ్యాలట్ బాక్సులను స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపరిచారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్‌లను శుక్రవారం గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ, జేసీ భార్గవ్‌తేజ, డీఆర్వో ఖాజావలీ, ఆర్డీవో శ్రీనివాసరావు, ఇతర అధికారులు పరిశీలించారు. బ్యాలెట్ బాక్సుల సీల్, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. పోలీసుల బందోబస్తును పర్యవేక్షించారు. అనంతరం ఏసీ కళాశాలలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, నిత్యం పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కలెక్టర్, ఇతర ఉన్నతాధికారుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లకు సిబ్బంది సీల్ వేశారు.



ప్రసంగిస్తున్న వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు

భాష, సాహిత్యాలే వ్యక్తిత్వ వికాసానికి మూలం

● వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కంచర్ల గంగాధరరావు

పెదకాకాని, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): భాష, సాహిత్యాలే వ్యక్తిత్వ వికాసానికి మూలం అని ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కంచర్ల గంగాధరరావు పేర్కొన్నారు. వర్సిటీలో రెండు రోజులుగా ఆర్ట్స్ కామర్స్, లా కళాశాల ఆధ్వర్యంలో 'కాల్పనికేతర సాహిత్య ధోరణులు 21వ శతాబ్దం దక్షిణ భారత భాషలు' అనే అంశంపై జరుగుతున్న జాతీయ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య గంగాధరరావు మాట్లాడుతూ గత రెండు రోజులుగా దక్షిణ భారత దేశ భాషలలో సాహితీ అంశాలపై ఉర్దూ విభాగం వారు సదస్సు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఆచార్య కోయి కోటేశ్వరరావు విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందటానికి సాహిత్యం ఏ విధంగా ప్రభావం చూపుతుందో తెలియజేసిన విధానం అందరినీ ఆకట్టుకుంది. శుక్రవారం ముగింపు సభలో రెండు రోజులుగా సదస్సులో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లను అందించారు.

జన్మభూమి, సింహాద్రి, ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల రద్దు

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కడియం - ద్వారపూడి - అనపర్తి సెక్షన్‌లో నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా సింహాద్రి, జన్మభూమి, ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు గుంటూరు డీఆర్ఎం ఎం రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 17239 గుంటూరు - విశాఖపట్నం సింహాద్రి ఎక్స్‌ప్రెస్ మార్చి 1, 2 తేదీల్లో, నంబరు. 17240 విశాఖపట్నం - గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ మార్చి 2, 3 తేదీల్లో రద్దు చేస్తున్నామన్నారు. నంబరు. 12805 విశాఖపట్నం - లింగంపల్లి జన్మభూమి, నంబరు. 22701 విశాఖపట్నం - గుంటూరు, నంబరు. 22702 గుంటూరు - విశాఖపట్నం ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను మార్చి 2వ తేదీన రద్దు చేస్తున్నామన్నారు. నంబరు. 12806 లింగంపల్లి - విశాఖపట్నం జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ని మార్చి 3వ తేదీన రద్దు చేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని డీఆర్ఎం విజ్ఞప్తి చేశారు.



మంగళగిరి-తెనాలి రోడ్డుపై కొలతలు వేస్తున్న సిబ్బంది

మంగళగిరి-తెనాలి-నారాకోడూరు మధ్య నాలుగు లేన్ల రహదారి

● మంత్రి లోకేశ్ చొరవతో డీపీఆర్ రూపకల్పన పనులు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ప్రధాన రహదార్లకు మోక్షం కలుగుతోంది. ఇప్పటికే జిల్లాలో కీలక రోడ్ల విస్తరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే తెనాలి-గుంటూరు వయా నారాకోడూరు, తెనాలి-విజయవాడ వయా మంగళగిరి రహదార్ల విస్తరణకు ఆమోదం లభించింది. తెనాలి నుంచి గుంటూరు మార్గంలో నారాకోడూరు వరకు, తెనాలి నుంచి విజయవాడ మార్గంలో మంగళగిరి హైవే వరకు నాలుగు లేన్లుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టింది. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో అధికారులు డీపీఆర్ రూపకల్పన పనులు కూడా ప్రారంభించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి నోచుకోకపోవడంతో గుంతల రహదార్లతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి లోకేశ్ చొరవతో ఈ ప్రాంత రూపురేఖలు మారుతున్నాయి. ఆయా గ్రామాల మధ్య తారురోడ్ల నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరుచేసి పనులను ప్రారంభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళగిరి-తెనాలి-నారాకోడూరు మధ్య 40.05 కిలోమీటర్ల మేర రహదార్లను నాలుగు వరుసలుగా విస్తరించేందుకు డీపీఆర్ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.కోటి 12వేలు విడుదల చేసింది. దీంతో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి డీపీఆర్ నివేదికలు సిద్ధం చేస్తున్నారు.



మంచినీటి చెరువులో హంస వాహనంపై విహరిస్తున్న ఉభయ దేవేరీ సమేతుడైన మల్లేశ్వరుడు

వైభవంగా మల్లేశ్వరస్వామి తెప్పోత్సవం

పెదకాకాని, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వర స్వామి హంస వాహనంపై మంచినీటి చెరువులో విహరించారు. మహాశివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం మల్లేశ్వరస్వామి, భ్రమరాంబ, గంగాదేవి అమ్మవార్లు హంస వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి తెప్పోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ఉపకమిషనర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అమరావతి రాజధాని ప్రాజెక్టులను పర్యవేక్షించనున్న సుర్బానా జురాంగ్, నైట్ ఫ్రాంక్

● ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ బృందంతో ఒప్పందం కుదుర్చుకొన్న ఏపీ సీఆర్‌డీఏ

● రాజధానిలో జరిగే పనులన్నీ పర్యవేక్షణ బాధ్యత వీరిదే !

విజయవాడ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో అభివృద్ధి ప్రాజెక్టుల పనులన్నింటినీ పర్యవేక్షించటం కోసం ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ(పీఎంసీ)లుగా సుర్బానా జురాంగ్, నైట్ ఫ్రాంక్‌లు వ్యవహరించనున్నాయి. గురువారం విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో ఆ సంస్థలతో ఉన్నతాధికారులు ఒప్పందం చేసుకున్నారు. సుర్బానా జురాంగ్, నైట్ ఫ్రాంక్‌ల కన్సల్‌టెంట్ల బృందం రాజధాని అమరావతి నిర్మాణ పనులను పరుగులు పెట్టించటానికి వీలుగా పనిచేయనున్నారు. రాజధానిలో సీఆర్‌డీఏ, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏడీసీఎల్) లు వివిధ ప్రాజెక్టులకు సంబంధించి టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థల పనులను ఈ కన్సల్‌టెంట్ బృందం పర్యవేక్షిస్తుంది. అదేవిధంగా ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల ఆర్థిక సహకారంతో రాజధానిలో జరగనున్న నిర్మాణపనులలో నిర్దేశించిన ప్రమాణాలు, నిబంధనలు అమలుపరిచే బాధ్యతలను కూడా సుర్బానా, నైట్ ఫ్రాంక్‌ల పీజీఎంసీ బృందం తోడ్పాటునందించనుంది. శుక్రవారం విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో సుర్బానా, నైట్ ఫ్రాంక్‌లతో ఈ మేరకు ఒప్పందం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఆర్‌డీఏ తరపున అదనపు కమిషనర్ (అడ్మినిస్ట్రేటివ్ వ్యవహారాలు) నవీన్ మల్లారపు, సుర్బానా జురాంగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తరపున ఆ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ (సౌత్ ఇండియా) అవినాశ్ మిశ్రా ఒప్పందపత్రాలను పరస్ప రం మార్చుకున్నారు. సీఆర్‌డీఏ స్ట్రా టజీ విభాగ డైరెక్టర్ ఎన్.సతీష్‌బా బు, సుర్బానా జురాంగ్ ఇండి యా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అభిషేక్ మల్హోత్రా, నైట్ ఫ్రాంక్(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ తరఫున ఆ సంస్థ డైరెక్టర్ విశ్వబంధు మెహ్రా పాల్గొన్నారు.

అమరావతి విల్డర్‌నెస్ పార్కు డీపీఆర్ సిద్ధం చేయండి

● 'ప్రగతి' ప్రతినిధులతో ఏడీసీ సీఎండీ డి.లక్ష్మీపార్థసారథి

విజయవాడ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): విభిన్నమైన ప్రకృతి సోయగాలతో టూరిస్టులను కట్టిపడేసేలా అమరావతిలోని శాఖమూరులో విల్డర్‌నెస్ పార్కును రూపొందించేందుకు వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను సిద్ధం చేయాలని ప్రగతి సంస్థ ప్రతినిధులకు అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) చైర్‌పర్సన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ డి.లక్ష్మీపార్థసారధి సూచించారు. శుక్రవారం విజయవాడ ఏడీసీ ప్రధాన కార్యాలయంలో ప్రగతి ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. శాఖమూరు సెంట్రల్‌పార్కులో విల్డర్‌నెస్ పార్కు నిర్మాణానికి ఏడీసీ 20 ఎకరాల భూమిని కేటాయించింది. ఇందులో ప్రకృతి ప్రసిద్ధిగాంచిన వృక్షజాలాన్ని పర్యావరణహితంగా పెంచి, పర్యాటకానికి ఆలవాలంగా తీర్చిదిద్దడమే పార్కు లక్ష్యం. ప్రకృతి ప్రియులను ఆకర్షించే రమ్యమైన రిసార్టులు నిర్మించి వాటి సరసన అరుదుగా కనిపించే ప్రకృతిసిద్ధమైన మొక్కలను పెంచి అవసరమైన మేరకు వసతిని కల్పించేవిధంగా ఈ ప్రాజెక్ట్ రూపుదిద్దుకోనుంది. సాధారణ ప్రజలందరికీ విల్డర్‌నెస్ పార్కులోనికి ఉచితప్రవేశాన్ని కల్పించేలా ప్రణాళిక రూపొందించాలని, ప్రముఖ పర్వదినాల నాడు ప్రజల భక్తిభావాలకు అనుగుణంగా ఉండే దేవతా వృక్షాలను ఇక్కడ పెంచేలా చూడాలని ప్రగతి ప్రతినిధులను సీఎండీ కోరారు. ఈ సమావేశంలో ఏడీసీ అర్బన్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్ హెడ్ పి.సురేష్‌బాబు, సీనియర్ అర్బన్ కె.లవణ్‌కుమార్, ప్రగతి సంస్థ చైర్మన్ జీబీకే రావు, ఎండీ జి.ఆంజనేయులు హాజరయ్యారు.



ప్రగతి సంస్థ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఏడీసీ సీఎండీ డి.లక్ష్మీపార్థసారథి

కోల్డ్‌స్టోరేజీల్లో మిర్చికి రుణాలివ్వాలి

● సీఎం ఆదేశాలను వివరించిన మార్కెటింగ్ జేడీ

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): శీతల గిడ్డంగుల్లో మిర్చి నిల్వ చేసుకొంటున్న రైతులకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వడం లేదని తెలిసింది.. ఇది సరైన పద్ధతి కాదు.. సీఎం చంద్రబాబు ఈ విషయంలో చాలా ఆగ్రహంగా ఉన్నారని మార్కెటింగ్ శాఖ విజయవాడ ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం మిర్చియార్డు పరిపాలన భవనంలో ఆయన లీడ్ బ్యాంకు డిస్ట్రిక్ మేనేజర్(ఎల్‌డీఎం) మహిపాల్‌రెడ్డితో కలిసి కోల్డ్‌స్టోరేజ్ యజమానులు, మార్కెటింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గత శనివారం సీఎం చంద్రబాబు వద్ద జరిగిన సమావేశంలో కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ చేసిన మిర్చి టిక్కీలకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వడం లేదని పలువురు చెప్పారని, ఇందుకు గల కారణాలను తెలుసుకొని నివేదించాలిందిగా ముఖ్యమంత్రి ఆదేశించారని చెప్పారు. సమావేశానికి హాజరైన కోల్డ్‌స్టోరేజ్‌ల యజమానులు మాట్లాడుతూ గత 35 ఏళ్లుగా తమ వద్ద రైతులు నిల్వ చేసుకొంటున్న మిర్చికి బ్యాంకర్లు రుణాలు ఇస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలో తమ ఆస్తులను తనఖా పెట్టుకొంటున్నారని తెలిపారు. 2023, 24 ఆర్థిక సంవత్సరాల్లో మిర్చి ధర అధికంగా ఉండటంతో బ్యాంకర్లు రుణాలు ఇచ్చారని, అయితే ఆ తర్వాత ధర పడిపోవడంతో రైతులు కోల్డ్‌స్టోరేజ్‌లలో అలానే టిక్కీలు ఉంచేసి బ్యాంకులకు రీపేమెంట్ చేయలేదన్నారు. ప్రస్తుతం గుంటూరు పరిసరాల్లోని 90 కోల్డ్‌స్టోరేజ్‌లలో దాదాపుగా 20 లక్షల పాత మిర్చి టిక్కీలున్నాయని, ప్రస్తుత సీజన్‌లో మరో 9 లక్షల టిక్కీల వరకు నిల్వ చేశారని చెప్పారు. ఎవరైతే బకాయిలున్నారో వారికి కొత్తగా రుణాలు ఇవ్వమని తాము కోరడం లేదని, ఎవరైతే సక్రమంగా చెల్లించారో, అలానే కొత్తగా రుణాల కోసం వస్తున్నారో వాళ్లకు ఇవ్వమని కోరుతున్నామన్నారు. బ్యాంకర్ల తరుపున ఎల్‌డీఎం మహిపాల్‌రెడ్డి, సిటీ యూనియన్ బ్యాంకు మేనేజర్ బాలాజీ మాట్లాడుతూ కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ చేసిన మిర్చికి టర్మ్‌లోన్ ఇస్తామన్నారు. సమావేశంలో మిర్చి యార్డు సెక్రెటరీ ఎ.చంద్రిక, మార్కెటింగ్ డీడీ ఝాన్సీరాణి, ఏడీ బి. రాజబాబు, కోల్డ్‌స్టోరేజ్‌ల యజమానుల సంఘం నుంచి కర్లపూడి వెంకటేశ్వరరావు, సురేంద్రరెడ్డి, శ్రీనివాస రెడ్డి, కొత్తూరి సుధాకర్, పమిడి కృష్ణ, వివిధ గ్రేడ్‌ల సెక్రెటరీలు సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్, ఆంజనేయసింగ్ తదితరులు పాల్గొన్నారు.

9 మంది కమీషన్ వ్యాపారస్తుల లైసెన్సుల నిలుపుదల

మిర్చియార్డులో ట్రాఫిక్‌కి ఆటంకం కలిగిస్తున్న కమీషన్ వ్యాపారస్తులపై మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు కొరడా ఝుళిపించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన మార్కెటింగ్, మిర్చియార్డు అధికారులతో కలిసి యార్డులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గేటు నంబరు. 4 ఎదురుగా ఉన్న కమీషన్ దుకాణాల వ్యాపారస్తులు మిర్చి టిక్కీలు అన్ని రోడ్లపై పడేసి వాహనాల రాకపోకలకు ఆటంకాలు కలిగించారు. దీనిపై జేడీ శ్రీనివాసరావు సీరియస్ అయి వ్యాపారస్తులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుంటే మీరేమి చేస్తున్నారని సూపర్‌వైజర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత వ్యాపారస్తుల లైసెన్సులను నిలుపుదల చేసినట్లుగా మైకులో ప్రకటన చేయించాలని ఆదేశించారు. శనివారం మిర్చియార్డు పరిపాలనభవనంలో కమీషన్ వ్యాపారులతో సమావేశం కావాలని నిర్ణయించారు.



బ్యాంకర్లు, కోల్డ్‌స్టోరేజీల యజమానులతో సమావేశమైన మార్కెటింగ్ జేడీ శ్రీనివాసరావు

370 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో శుక్రవారం జరిగిన వేలంలో 370 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు, కాయ ఒకేధరలు పలికాయి. క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.8,500, గరిష్ఠ ధర రూ. 10,500, మోడల్ ధర రూ.10,500 పలికాయి.

నేడు ప్రత్తిపాడు రానున్న కేంద్ర మంత్రి పెమ్మసాని

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో ఎన్టీఆర్ విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమంతో పాటు బడ్జెట్‌లో గుంటూరు ఛానల్‌కు నిధులను కేటాయించిన ముఖ్య మంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతూ ఏర్పాటు చేయనున్న ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొనేందుకు గానూ గుంటూరు పార్లమెంటు సభ్యుడు, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం ప్రత్తిపాడు వస్తున్నట్లు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పశ్చిమడెల్టాకాల్వకు 1216 క్యూసెక్కులు విడుదల

దుగ్గిరాల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకాల్వకు 1216 క్యూసెక్కుల సాగునీటిని గురువారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజివద్ద 11.8 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 77 క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 70 క్యూసెక్కులు, పశ్చిమకాల్వకు క్యూసెక్కులు, నిజాంపట్నంకాల్వకు 58 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 110 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

జనసేన నేత రాజీనామా

తాడేపల్లి (చిర్రావూరు), ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎంటిఎంసి పరిధిలోని చిర్రావూరు గ్రామాన్ని కార్పొరేషన్‌లో విలీనాన్ని వ్యతిరేకిస్తూ తాడేపల్లి మండలం జనసేన ప్రధాన కార్యదర్శి సీర్ల లాల్‌చంద్ తన పదవికి రాజీనామా చేశారు. తాడేపల్లిలో గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్పొరేషన్‌ను తొలగించి మంత్రి లోకేశ్ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దా నం ప్రకారం తాడేపల్లిని మునిసిపాలిటీగా ప్రకటించాలని లాల్ చంద్ డిమాండ్ చేశారు. విలీనాన్ని వ్యతిరేకిస్తూ జనసేన పార్టీలో తన బాధ్యతకు రాజీనామా చేస్తున్నానంటూ లాల్ చంద్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

వ్యాస రచన పోటీల్లో చమళ్ళమూడి విద్యార్థి ప్రతిభ

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సైన్స్ డే 2025 సందర్భంగా గుంటూరులోని స్థానిక పరీక్షా భవన్‌లో జిల్లా స్థాయిలో శుక్రవారం నిర్వహించిన వ్యాస రచన, డ్రాయింగ్, వక్తృత్వ పోటీలు నిర్వహించగా వ్యాస రచన జూనియర్ విభాగం 5, 6, 7 తరగతుల్లో చమళ్ళమూడి ఎంపీపీ స్కూల్ 5వ తరగతి విద్యార్థి వక్కలగడ్డ వంశీ సాయికి తృతీయ బహుమతి లభించింది. విద్యార్థి బహుమతి అందుకోవటం పట్ల మండల విద్యా శాఖ అధికారి జీ సత్యనారాయణమూర్తి, పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే సైన్స్ ఎగ్జిబిషన్

మేడికొండూరు: ఫిబ్రవరి 28: విద్యార్థుల లో విజ్ఞానాన్ని, వారిలో అంతర్లీనంగా దాగివున్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్ దోహదపడుతుందని ఇంటెల్ హైస్కూల్ డైరెక్టర్ డాక్టర్ కోనూరి జయకుమార్ తెలిపారు. మేడికొండూరు మండలం పేరేచర్లలోని ఇంటెల్ హైస్కూల్లో రెండు రోజుల పాటు నిర్వహించే సైన్స్ ఎగ్జిబిషను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయకుమార్ మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచన సరళి పెంపొందించేందుకు, వారిలో సరికొత్త ఆవిష్కరణల వైపు ఆకర్షించేలా సైన్స్ ఎగ్జిబిషన్ రూపొందించినట్టు తెలిపారు. ప్రతి విద్యార్థి అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మారుతున్న కాలానుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకొని ప్రతి విద్యార్థి ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా సైన్స్ ఎగ్జిబిషన్‌లో భౌతిక శాస్త్రం, ఎలక్ట్రానిక్స్ విభాగాలు నుంచి అత్యవసర సమయాలలో ఉపయోగించే సెన్సార్ ఆధారిత నీటి స్ప్రింకర్లు, ఎలక్ట్రానిక్ పియానో, ఆటోమేటిక్ డస్ట్ బిన్, కూలర్ సౌర వ్యవస్థ నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సుమారు 2 వందల ప్రదర్శనల విద్యార్థులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హై స్కూల్ ప్రిన్సిపాల్ కోనూరి రాణి జయ కుమార్, సైన్స్ ఎగ్జిబిషన్ ఇన్‌చార్జిలు విజయలక్ష్మి, జై భూన్ తదితరులతో పాటు పలువురు అధ్యాపక సిబ్బంది, వివిధ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

గొప్ప ఆవిష్కరణలను రూపొందించాలి

మేడికొండూరు: ఫిబ్రవరి 28: వికసిత్ భారత్ కోసం సైన్స్ లో ఎన్నో గొప్ప ఆవిష్కరణలు రూపొందించాలని ఎస్ఆర్ఐ కళాశాల ప్రిన్సిపాల్ కోట శ్రీనివాసు చెప్పారు. మేడికొండూరు సమీపంలోని ఎస్ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాలలో సైన్స్ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ కోట శ్రీనివాసు అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగిస్తూ సైన్స్ దినోత్సవమూల కారణమైన డాక్టర్ సివి. రామన్ భౌతిక శాస్త్రంలో చేసిన పరిశోధనలకు గాను 1930లోనే నోబెల్ బహుమతి సాధించారన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధిపతులు రాము, కేఎస్ఆర్, నాగేశ్వరావు, ఏవో సీతారామయ్య, కోటేశ్వరావు, సౌజన్య, తదితరులతో పాటు బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతోనే పురోభివృద్ధి

● మంత్రి నిమ్మల రామానాయుడు
● వివిధ ప్రాంతాల్లో జాతీయ సైన్స్ దినోత్సవం



సైన్స్ ప్రదర్శనను తిలకిస్తున్న మంత్రి రామానాయుడు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతోనే సమాజ పురోభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. వివిధ ప్రాజెక్టును పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ ప్రయోగాలతో విద్యార్థుల్లో పరిజ్ఞానం పెంపొందుతుందన్నారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం లేకుండా సమాజం ఒక్క అడుగు కూడా ముందుకు వెళ్లలేదని, సైన్సు పట్ల భావితరాలకు మరింత అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రాజెక్టుకు బహుమతి

నాసా ప్రతియేటా నిర్వహించే సైన్స్ ప్రాజెక్టులో మంగళగిరి షరాబ్ బజారులోని శ్రీచైతన్య టెక్నో స్కూల్ బ్రాంచి విద్యార్థులు రూపొందించిన గ్రోయింగ్ పొటాటో ఇన్ ద స్పేస్ ప్రాజెక్టుకు రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి లభించింది. ఈ మేరకు సైన్స్ డే సందర్భంగా శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పోలో ప్రాజెక్టు రూపొందించిన విద్యార్థులు



సర్టిఫికెట్లతో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు

మోక్షిత మాధురి, శశి గాయత్రి, జ్యోతికశ్రీ, వెంకట నాగ సాద్విక్‌లను యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు. నాసాపంపిన సర్టిఫికెట్లు, పతకాలను అందజేశారు. కార్యక్రమంలో వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, శ్రీచైతన్య విద్యా సంస్థల ఏజీఎం మురళీకృష్ణ, ఆర్ఐ రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నమూనాలను రూపొందించిన విద్యార్థులతో చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు

మంగళగిరి, (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతకు పదును పెట్టేందుకు సైన్సు ప్రదర్శనలు దోహదం చేస్తాయని ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి టిపర్ల బజారులోని నారాయణ ఇంగ్లీషు మీడియం హైస్కూల్లో శుక్రవారం సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా చిల్లపల్లి మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణిస్తూనే సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పర్వతం మధుసూదన్‌రావు, జనసేన నేత చిట్టెం అవినాష్ పాల్గొన్నారు.

తాడేపల్లిటౌన్, (ఆంధ్రజ్యోతి): ఎంటిఎంసి పరిధిలోని నులకపేట శ్రీచైతన్య స్కూల్లో సైన్స్ ఎగ్జిబిషన్‌ను



తాడేపల్లి శ్రీచైతన్య విద్యార్థులతో కరచాలనం చేస్తున్న ముఖ్య అతిథి వెంకయ్య, ఉపాధ్యాయులు

మంగళగిరికి చెందిన న్యాయవాది ఎస్ఎం వెంకయ్య ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భౌతికశాస్త్రంలో రామన్ చేసిన అపారమైన సేవలకు గుర్తింపుగా ఆయన గౌరవార్ధం ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య పాఠశాల ఏజీఎం మురళీకృష్ణ, ఆర్ఐ రామారావు, కో-ఆర్డినేటర్ చక్రధరప్రసాద్, ప్రిన్సిపాల్ సుధీర్ ప్రసాద్, శ్రావణ్‌కుమార్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుగ్గిరాల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ పాఠశాలల్లో సైన్సు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కృష్ణాకరకట్ట పరిసర గ్రామమైన పెదకొండూరులోని హైస్కూల్లో సైన్సు ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఇసుకను తవ్వే ప్రొక్లెయినర్, కర్ర, చెక్కలతో సిద్ధం చేసి, రైతు, రైతుకూలీల వేషధారణతో ప్రదర్శించి ఆకట్టుకున్నారు. అదేవిధంగా వాటర్ ఫౌంటెయిన్, రాకెట్ తదితర ఆవిష్కరణలను విద్యార్థులు ప్రదర్శించారు. హెచ్ఎం బట్టి వెంకటకృష్ణారావు పర్యవేక్షణలో పెదపాలెం పాఠశాలల కాంప్లెక్స్ పరిధిలోని



పెదకొండూరు హైస్కూల్ విద్యార్థులు తయారుచేసిన సైన్సుప్రాజెక్టులను తిలకిస్తున్న గ్రామస్థులు

పెదకొండూరు, ఈమని, పెదపాలెం హైస్కూళ్లకు చెందిన విద్యార్థులు సిద్ధం చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దుగ్గిరాల జడ్పీ బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎం శోభాదేవి సీవీ.రామన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థినులు సైన్సు ఆవిష్కరణలను ప్రదర్శించారు.

ప్రత్తిపాడు, (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులోని అక్షయ విద్యాలయంలో విద్యార్థినీ విద్యార్థులు వివిధ సైన్సు ఆవిష్కరణలను తయారుచేసి ప్రదర్శించారు. అవి పనిచేసే విధానంతో పాటు వాటి వలన కలిగే ఉపయోగాలను వివరించారు. విద్యార్థులు శాస్త్ర సాంకేతిక విద్యలో అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ వెలగా రాఘవయ్య చౌదరి పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు

పెదనందిపాడు, ఫిబ్రవరి, 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీఏఎస్ కళాశాలలో శనివారం నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎగ్జామ్స్ చీఫ్ కె.ప్రతాప్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, విద్యార్థులు ఉదయం 8.30గంటలకే కేంద్రానికి రావాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, లైటింగ్ వంటి సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు.

8688831595



రేవేంద్రపాడు హైస్కూల్‌లో సీపీఆర్ శిక్షణ ఇస్తున్న కెఎల్‌యూ, ఎయిమ్స్ బృందం

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన, శిక్షణ

దుగ్గిరాల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవేంద్రపాడు జడ్పీఉన్నత పాఠశాలలో సీపీఆర్ ప్రథమ చికిత్సపై శిక్షణ శుక్రవారం నిర్వహించారు. స్మార్ట్‌విలేజ్ రివల్యూషన్ ఆధ్వర్యంలో కెఎల్‌యూ, ఎయిమ్స్ హాస్పిటల్ వైద్యబృందం భాగస్వామ్యంతో సీపీఆర్ ప్రథమచికిత్స విధానాన్ని విద్యార్థులకు తెలియజేశారు. గుండెపోటుకు గురైన వ్యక్తిని అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ ద్వారా రక్షించుకోవడం ఎలాగో పప్పెట్‌ల ద్వారా ప్రదర్శన జరిపారు. ఎయిమ్స్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ రాకేశ్ నేతృత్వంలో జరిగిన శిక్షణలో, మనిషి ప్రాణాలను మూడుదశలుగా ప్రథమ చికిత్స పద్ధతులను తెలియజేశారు. మొదటిదశ చెక్, రెండోదశ కాల్, మూడోదశ కంప్రెషన్‌లను ఎలా అమలు చేయాలో తెలిపారు. 10 సెకండ్లలో సీపీఆర్ ప్రారంభించ గల్గితే 90 శాతం మందిని కాపాడుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో పీవీ సత్యనారాయణ, శివకృష్ణ, విద్యార్థుల బృందం పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆవరణలో మట్టి తొలగింపుపై వివాదం

పెదనందిపాడు, ఫిబ్రవరి, 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరనలో 2022లో కొంత స్థలాన్ని పెదనందిపాడు గ్రామానికి వైసీపీ నాయకుడు లీజుకు తీసుకొని షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించుకున్నారు. శుక్రవారం బస్టాండ్ ఆవరణలోని మట్టిని తీసే ప్రయత్నం చేయగా గ్రామస్థులు అడ్డుకొని. ఎందుకు మట్టితీస్తున్నారని ఆ ప్రశ్నించారు. దీంతో ఆ వైసీపీ నేత తమకు ఆర్టీసీ అధికారులే అనుమతులు ఇచ్చారని తెలిపారు. దీంతో మట్టితో పాటు మురుగు నీరు పారుదలకు ఆటంకంగా కాంప్లెక్స్ ఎదుట ఉన్న తూములు కూడా తొలగించాలని, లేకపోతే మట్టితోలేందుకు వీలు లేదంటూ అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇంతలో ఆ సంఘటనా స్థలానికి ఎస్ఐ మధుపవన్ వచ్చి ఇరు వర్గాలను చెదరగొట్టారు. అనంతరం కార్యదర్శి శ్వేత ఇరువర్గాలతో మాట్లాడి ఇప్పుడు ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, కోడ్ ముగిసిన తదుపరి సర్వే నివేదిక ఆధారంగా తూములు తొలగించి తగు చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది.

నేటి నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

ఫిరంగిపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాల్లో మార్చి నెల 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలు వేయనున్నామని మండల వైద్యాధికారి షేక్ పీర్ అహమ్మద్ శుక్రవారం తెలిపారు. పశువులకు సంక్రమించే వైరల్ వ్యాధి గాలికుంట వ్యాధి అని ఆయన తెలిపారు. ఆవులు, గేదెలను ఈ వ్యాధి ప్రభావితం చేస్తుందన్నారు. నోటిలో, గిట్టెల మధ్యలో పుండ్లు ఏర్పడతాయన్నారు. నోటి నుంచి ద్రవం కారటం, పాలు బాగా తగ్గిపోవటం, పాదాల్లో నొప్పి, అలసట, జ్వరం, ఆకలి తగ్గటం, ఊపిరి పోవటం, తిరగ గట్టడం, సూడి నిలవక పోవటం, మేత, నీరు సరిగా తీసుకోక పోవటం ఈ వ్యాధి లక్షణాలని, వ్యాధి సోకినట్లు తెలిస్తే పశు వైద్యులను సంప్రదించాలని కోరారు.

నీటి నిర్వహణపై సాంకేతిక పరిజ్ఞానం అవసరం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నీటి నిర్వహణపై పురుషులతో పాటు మహిళలు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించు కోవాలని వాటర్ ఎయిడ్ స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ సురేష్ తెలిపారు. గ్రామ స్థాయిలో నీటి నాణ్యత పరీక్షలపై మహిళల్లో అవగాహన తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ద్వారా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఇందులో బాగంగా ప్రత్తిపాడులోని వెలుగు కార్యాలయంలో వీవోఏలకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ సురేష్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో నీటి నిర్వహణపై సరైన సాంకేతిక నైపుణ్యాలు కలిగిన సభ్యులు లేకపోవడం వలన నీటి సమస్యలు తలెత్తిన పరిష్కరించ లేకపోతున్నామన్నారు. ఈ సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సాంకేతిక పరంగా అన్ని గ్రామాలలో మహిళలు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా టెక్నికల్ కో ఆర్డినేటర్ సునిల్, ఏపీఎం లాజరు పాల్గొన్నారు.



శాస్త్రవేత్త రామన్ ఎఫెక్ట్ ఆవిష్కరణను తిలకిస్తున్న విద్యార్థినీ విద్యార్థులు

సర్ సీవీ రామన్ ఎఫెక్ట్ ఆవిష్కరణ

ఫిరంగిపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేమవరం గ్రామంలో గల ఎంపీపీ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శాస్త్రవేత్త సీవీ రామన్ ఎఫెక్ట్‌ను విద్యార్థులు శుక్రవారం ఆవిష్కరించారు. పాఠశాలలో భారతీయ శాస్త్రవేత్తల ఆవిష్కరణ చిత్ర ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. జన జీవన విధానాన్ని, నూతన ఆవిష్కరణలు సులభతరం చేస్తాయని ప్రధానోపాధ్యాయుడు కమల మోహన్ తెలిపారు. పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ సుబ్బయ్య, గ్రామ కార్యదర్శి జోజి బాబు, ఉపాధ్యాయులు రవి కుమార్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తరిగిపోతున్న తాగునీటి వనరులు

● భవిష్యత్ తరాలకు నీటివిలువను తెలియజేయాలి
● ఎస్ఆర్ఎంలో ముగిసిన జాతీయ వర్క్‌షాపు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వస్తున్న మార్పులు, నీటి కాలుష్యం, ఇతరత్రా కారణాల వలన విశ్వవ్యాప్తంగా తాగునీటి లభ్యత తగ్గిపోతుందని, జీవరాశి మనుగడకు ప్రాణాధారమైన తాగునీటిని పొదుపుగా వాడుకోవడం అత్యంత ఆవశ్యమని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ ప్రొఫెసర్ రాజశేఖర్ బాలసుబ్రమణియన్ అన్నారు. మంగళగిరిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నీటి అవసరాలు- సవాళ్లు- పరిష్కారాలు అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగిన వర్క్‌షాపు శుక్రవారంతో ముగిసింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరుగడించిన పలు యూనివర్సిటీలలో నీటిపై పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తలు, నిపుణులు ఈ వర్క్‌షాపుకు హాజరయ్యారు. పెరుగుతున్న తాగునీటి అవసరాలకు అనుగుణంగా నీటి వనరుల అభివృద్ధి జరగాలని భవిష్యత్తు తరాలకు నీటి విలువను తెలియజేయాలని కోరారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని, సృజనాత్మకతను జోడించి స్వచ్ఛమైన నీటిని పెంచుకోవలసిన అవసరం వుందన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్ రాజశేఖర్, ఎస్ఆర్ఎం ప్రతినిధులు

ఎస్ఆర్ఎం ఉపకులపతి ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా మాట్లాడుతూ జల్ హీ జీవన్ నినాదాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. నీటి విషయంలో ఎదురవుతున్న సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని మానవాళి ప్రయోజనాలకు దోహదపడే పరిశోధనలు జరగాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ప్రేమ్‌కుమార్, డీన్ డాక్టర్ సీవీటామీ, రీసెర్చ్ డీన్ డాక్టర్ రంజిత్, డాక్టర్ రంగభాష్యం, డాక్టర్ కౌశల్‌దాస్ పాల్గొన్నారు.

150 దేశాల కరెన్సీ స్టాంపుల ప్రదర్శన

తుళ్లూరు, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్స్ డే సందర్భంగా 150 దేశాల కరెన్సీ, స్టాంపులను తుళ్లూరు కెవిఆర్ జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం ప్రదర్శనకు ఉంచారు. అలాగే విద్యార్థులకు వక్తృత్వ , డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ప్రఖ్యాత సైంటిస్ట్ సీవి రామన్ చరిత్రను, రామన్ ఎఫెక్ట్‌ను విద్యార్థులకు వివరించారు. సైన్స్ ప్రాధాన్యత గురించి రామన్ చెప్పిన విషయాలను విశదీకరించారు. సర్ సీవీ రామన్ సేవలను గుర్తించి నోబెల్, భారత రత్న అవార్డులను ప్రభుత్వం అందించిందని ప్రధాన ఉపాధ్యాయుడు గుత్తా శ్రీనివాసరావు విద్యార్థులకు వివరించారు. చదువుతో విజ్ఞానం.. విజ్ఞానంతో సైన్స్ నేర్చుకొని సీవిరామన్ లాగ ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని విద్యార్థులకు బోధించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు మామిళ్లపల్లి కృష్ణయ్య, విద్యార్థులు, ఉపాధ్యాయులు సీవీ రామన్ చిత్రపటానికి పూల మాల వేసి నివాలులర్పించారు.



చేనేత జౌళి శాఖ కమిషనర్ రేఖారాణికి వినతిపత్రం అందజేస్తున్న చేనేత కార్మిక సంఘం ప్రతినిధులు

చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మంగళగిరిలోని రాష్ట్ర చేనేత జౌళిశాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం జౌళి శాఖ కమిషనర్ జీ.రేఖారాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ రంగం తర్వాత ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న చేనేత పరిశ్రమ పాలకుల నిర్లక్ష్యం కారణంగా సంక్షోభంలో కూరుకుపోయిందని ధ్వజమెత్తారు. ఫలితంగా నేత కార్మికులు ఆకలి చావులు, ఆత్మహత్యలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం నేటి వరకు జీవో విడుదల చేయలేదన్నారు. 30శాతం రిబేటు ఏడాది మొత్తం కొనసాగించాలని, నేతన్న నేస్తం మగ్గం నేస్తున్న ప్రతి కార్మికుడితోపాటు అనుబంధ వృత్తుల వారికి ఇవ్వాలని, సహకార సంఘాలను బలోపేతం చేయాలని, చేనేత సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, చేనేతపై జీఎస్టీ పూర్తిగా ఎత్తివేయాలని, సహకార సంఘాలకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే.శివదుర్గారావు, ఉపాధ్యక్షుడు డి.రామారావు, కే.వెంకటేశ్వరరావు, వీరభద్రం, డి.శ్రీలక్ష్మీ కే.లక్ష్మీ, మురుగుడు సత్యనారాయణ, కే.మల్లికార్జునరావు, డి.సత్యనారాయణ, జే.శివభావన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న వై.వి.ఆంజనేయులు, డాక్టర్ పెరుమాళ్లు

ఫార్మసీ రంగంలో పెను మార్పులు

● మలినేని పెరుమాళ్లు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్

తాడికొండ(లాం)ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతికతతో ఫార్మసీ రంగంలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయని మలినేని పెరుమాళ్లు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు అన్నారు. శుక్రవారం లాం చలపతి ఫార్మసీ కళాశాలలోని పూర్వవిద్యార్థుల సంఘం, సీఎల్‌పీటీ- ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ సెల్ సహకారంతో నేషనల్ సైన్స్ డే సందర్భంగా 'ట్రాన్స్‌ఫార్మింగ్ ఐడియాస్ ఇన్ టూ రియాలిటి- పయనీరింగ్ ఇన్నోవేషన్ ఫర్ హెల్త్' అను అంశంపై ఐడియా థాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మలినేని పెరుమాళ్ల ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రతి రంగంలోకి ప్రవేశించిందని, డ్రైవర్ లేని వాహనం ఏవిధంగా అయితే చూస్తున్నామో భవిష్యత్తులో డాక్టర్ లేని చికిత్సలు అందుబాటులోకి వస్తాయన్నారు. మారుతున్న సాంకేతికతతో పాటు విద్యార్థులు కూడా అభివృద్ధి చెందాలని సూచించారు. ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ ఐడియాథాన్ కార్యక్రమంలో 117 మంది వివిధ కళాశాలల నుంచి రిజిస్టర్ చేసుకొని సైన్స్ ప్రదర్శనల్లో పాల్గొన్నారని తెలిపారు. ఉత్తమ ఆలోచనల కలిగిన ఐదుగురికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చలపతి విద్యాసంస్థల చైర్మన్ వై.వీ.ఆంజనేయులు, గుంటూరు ఆప్టిక్ థర్డ్ ఐ సొల్యూషన్స్ వ్యవస్థాపకులు, సీఈవో జే.సంతోష్, ఏఎస్‌యు కాలేజీ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ.ప్రమీలరాణి తదితరులు పాల్గొన్నారు.

లాం చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవ కార్యక్రమంలో గుంటూరు జిల్లా జన విజ్ఞాన వేదిక ప్రెసిడెంట్ టీ.ఆర్. రమేష్ మాట్లాడుతూ నేటి విద్యార్థులు పరిశోధనాత్మకతపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. చంద్రశేఖర్ మాట్లాడుతూ విజ్ఞాన పరిశోధనలు మానవాళికి ఎంతో ఉపయోగ పడతాయన్నారు. కార్యక్రమంలో బేసిక్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఏ. రాధాకృష్ణమూర్తి, ఇతర అధ్యాపకులు, విభాగాధిపతులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

మోతడక చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కే. నాగ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ సంవత్సరంర వీక్షిత్ భారత్ కోసం సైన్స్, ఇన్నోవేషన్‌లో ప్రపంచ నాయకత్వం కోసం భారతీయ యువతకు సాధికారిత కల్పించడం ద్వారా విద్యార్థులు కొత్త ఆవిష్కరణలు ప్రయత్నించాలన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ డీన్ డాక్టర్ పీ.ఫణికుమార్, ఐఐసీ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎస్. శాంతిప్రియ, బేసిక్ సైన్స్ విభాగాధిపతులు డాక్టర్ బీ.తులసీరాణి, ప్రొఫెసర్ డీ.శంకరరావులు పాల్గొన్నారు.



ఎంబ్రాయిడింగ్ చేసిన మంత్రి లోకేశ్ చిత్రాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

టైలర్ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు

మంగళగిరి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టైలర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. అమరావతి టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళగిరి ఈద్గా షాదీ మహల్‌లో శుక్రవారం టైలర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. తొలుత కుట్టు మిషన్ సృష్టికర్త విలియమ్స్ హోవే చిత్రపటానికి నివాళులు అర్పించారు. మహిళా టైలర్ రాష్ట్ర మంత్రి లోకేశ్ చిత్రంతో ఎంబ్రాయిడింగ్ చేసిన వస్త్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ టైలర్ల అభివృద్ధికి ప్రతి నియోజకవర్గంలో మూడు వేలకు తగ్గకుండా కుట్టుమిషన్లు అందజేస్తామన్నారు. టైలర్లకు ప్రత్యేక కార్పొరేషన్, పింఛన్ సౌకర్యం వంటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, మునిసిపల్ మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, సీపీఐ నేత కంచర్ల కాశయ్య, సీపీఎం నేత పీ.బాలకృష్ణ, టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా, ప్రధాన కార్యదర్శి జంజనం వెంకట సాంబశివరావు, కోశాధికారి చాదరాసుపల్లి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల,(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం దుగ్గిరాలలో అంతర్జాతీయ దర్జీల దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టైలర్స్‌డే కేక్‌ను కట్ చేసిన అనంతరం, టైలర్‌ల సంఘం అధ్యక్షుడు వీ. నాగేశ్వరరావు (శివాటైలర్) మాట్లాడుతూ, ఆదరణ పథకం ద్వారా టైలరింగ్ పనిముట్లు ఉచితంగా అందించాలని, స్వయంఅభివృద్ధి కోసం బ్యాంకుల ద్వారా ఎలాంటి హామీలేని రుణ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రెసిడెంట్ శివాటైలర్ వి. నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ కుమార్ టైలర్ ఎం. లక్ష్మయ్య, కార్యదర్శి రూపాటైలర్స్ పి. పాములు, కోశాధికారి పల్లవిటైలర్, బీ. శ్రీనివాసరావు, టైలర్ జీనియస్ టైలర్ షేక్ బాషా, డిస్కోరా టైలర్ అమీర్‌జాన్ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

ఆర్జిత సేవా టికెట్ల ధర పెంపు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ సహస్ర లింగేశ్వరస్వామి, శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఆర్జిత సేవా టికెట్‌ల ధరలను పెంచాలని నిర్ణయించినట్లు ఆలయ ఈవో గద్దే వెంకట అమరనాథ్ శుక్రవారం తెలిపారు. సహస్ర నామ అర్చనను రూ.100 నుంచి రూ .200 గానూ, వసతి గృహం అద్దె రూ.300 నుంచి రూ.500కు, పెంచనున్నట్లు చెప్పారు. నూతనంగా ప్రవేశపెట్టిన శాంతి కల్యాణం టికెట్‌ను రూ.2116గా ధరలు నిర్ణయించినట్లు చెప్పారు. ఈ విషయంపై అభ్యంతరాలు ఉంటే ఈవో కార్యాలయంలో తెలియజేయవలసిందిగా సూచించారు.

బలమైన ఆర్థిక ప్రణాళికతో రాష్ట్ర బడ్జెట్

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భవిష్యత్తు నిర్మాణానికి బలమైన ఆర్థిక ప్రణాళికలతో రాష్ట్ర బడ్జెట్‌ను రూపొందించారని ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ శుక్రవారం అన్నారు. ఆంధ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్ ఉందన్నారు. అమరావతి నిర్మాణానికి వ్యవసాయరంగ అభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యం, ఇచ్చేలా ఉందన్నారు. దేశానికి అన్నం పెడుతున్న రైతన్నకు భరోసాగా పోలవరం నిర్మాణంతో పాటు వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ రూపకల్పన చేసిన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. పెను ఆర్థికభారం ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజన్‌కు అనుగుణంగా తొలిసారి రూ.3.22 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టారన్నారు. బడ్జెట్ ద్వారా తన అనుభవాన్ని చాటి చెప్పిన ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్‌కు అభినందనలు తెలిపారు. సవాళ్లను ఎదుర్కొంటూ చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ప్రజా రంజక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ప్రభుత్వానికి ఎమ్మెల్యే నరేంద్రకుమార్ అభినందనలు తెలియజేశారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలి

● ప్రధానోపాధ్యాయురాలు నాగజ్యోతి

కొల్లిపర, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తూములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాజీ విద్యా కమిటీ ఛైర్మన్ వింతా వేణుగోపాల్‌రెడ్డి అందజేసిన క్రీడా దుస్తులను గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు క్రీడాకారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నాగలక్ష్మి మాట్లాడుతూ క్రీడలతో కూడిన విద్యతో సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకుంటే గెలుపు దిశలో పయనించవచ్చన్నారు. క్రీడల వలన శారీరకంగా ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కూడా పొందవచ్చునన్నారు. సమావేశంలో గ్రామ పెద్దలు కొండా కిశోర్‌రెడ్డి, మర్రెడ్డి బ్రహ్మారెడ్డి, ఉపాధ్యాయులు ఎం.సూర్యప్రకాశరావు, రవికుమార్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసిస్టులపై గురుతర బాధ్యత: సీఈవో గిరిబాబు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మారుతున్న సమాజంలో ఫార్మసిస్టులపై గురుతర బాధ్యత నెలకొందని హెల్త్ హాస్పటల్స్ సీఈవో గిరిబాబు పేర్కొన్నారు. ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం ఫేర్‌వెల్ డే వేడుకలు నిర్వహించారు. ఎఎస్ఎన్ విద్యా సంస్థల ఛైర్మన్ అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ, సోదరభావంతో విద్యార్థులు మెలగాలని, పోటీ ప్రపంచంలో రాణించేందుకు అవసరమైన నైపుణ్యాలను అందుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ, హెచ్‌వోడీలు జ్యోతిబసు, అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

గ్రామదేవతకు ప్రత్యేక పూజలు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరులో కొలువుదీరి ఉన్న గ్రామదేవత అంకమ్మతల్లికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామం నుంచి పెద్దసంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించి మొక్కుబడులను తీర్చుకున్నారు.

వసంతోత్సవ పూజలు

మండలంలోని సంగంజాగర్లమూడి బాలాత్రిపురసుందరీసమేత సంగమేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం వసంతోత్సవం జరిపి అనంతరం స్వామివార్ల గ్రామోత్సవం కనుల పండుగగా జరిపారు. పెద్దసంఖ్యలో భక్తులు ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌తో అభివృద్ధి సాధ్యం: వీరవల్లి మురళి

తెనాలి రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో రాష్ట్ర ప్రగతితోపాటు పేద, మధ్య తరగతి ప్రజల అభివృద్ధి సాధ్యం అవుతుందని గణేష్‌యూత్ కన్వీనర్ టీడీపీ సీనియర్ నేత వీరవల్లి మురళి అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో పరిశ్రమలను దెబ్బతీసి పోలవరం వంటి ప్రాజెక్టులను అటకెక్కించి దుర్మార్గంగా వ్యవహరించిందని ఆరోపించారు. రాజధాని అమరావతిని సైతం నీరుగార్చేలా వ్యవహరించిందని మండిపడ్డారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏనాడు ఒక్కపైసా కూడా ప్రజలపై భారం పడకుండా ప్రవేశపెట్టిన దాఖలాలు లేవని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఆర్థిక శాఖామంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ వైసీపీ జగన్‌మోహన్‌రెడ్డికి చెంపపెట్టన్నారు. అన్నివర్గాల ప్రజలకు మేలు జరిగేలా, సంక్షేమ పథకాలకు ఇలా ప్రతి ఒక్కరికీ ఉపయోగపడేలా బడ్జెట్ ఉందన్నారు.

కుండల తయారీకి మట్టి కొరత



సుద్దపల్లి క్వారీ నుంచి ట్రాక్టర్‌తో మట్టిని దిగుమతి చేసుకుంటున్న కార్మికులు

- ఇబ్బందులు పడుతున్న తయారీదారులు
- వేసవిలో డిమాండ్ ఉన్నా అందించలేని వైనం
- తయారైన కుండలకు రక్షణ కరువు
- పెరిగిన ముడిసరుకు ధరతో మిగిలేది అంతంతే
- ప్రభుత్వం ఆదుకోవాలని శాలివాహనుల వినతి

తెనాలి రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వేసవి తాపానికి చల్లని నీరు తాగాలని ప్రతి ఒక్కరికీ అనిపిస్తుంది. అందుకు విద్యుత్‌తో ఫ్రిజ్‌లు వినియోగించేవారు ఉన్నప్పటికీ ప్రకృతి సహజంగా చల్లబరిచే గుణం ఉన్న మట్టి కుండల వినియోగించేవారు కూడా అధికంగానే ఉన్నారు. సాధారణంగా ఏప్రిల్ నెల నుంచి ఎండ తీవ్రత పెరుగుతుంది. కాని ఈ ఏడాది మార్చి ప్రారంభం నుంచే రాత్రి సమయంలో కొంత మంచు కురుస్తున్నా ఉదయం 8 గంటల నుంచి వేడి తీవ్రత పెరుగుతోంది. మధ్యాహ్న సమయంలో ఇంట్లో ఉండే వారికి సైతం ఎండ ప్రభావంతో దాహం వేస్తూ చల్లని నీటితో దప్పిక తీర్చుకోవాలని ఉంటుంది. కొందరు కుండ నీరు ఎక్కువగా ఇష్టపడుతుండటంతో కుండల కొనుగోళ్లకు డిమాండ్ పెరిగింది. ఎండాకాలంలో కుండలకు మంచి డిమాండ్ ఉన్నప్పటికీ వాటి తయారీదారుల్లో మాత్రం ఆనందం లేకుండాపోయింది. తరతరాల నుండి మట్టి ఉత్పత్తులతో జీవనం సాగిస్తున్న శాలివాహనులకు ముడిసరుకు కొరతతో వారికి ఇబ్బందులు తప్పడం లేదు. వేసవి వస్తేనే కుండలు, కూజాలు, ఇతర మట్టి ఆకృతులకు మంచి డిమాండ్ ఉంటుంది. ఏడాది మొత్తంలో ఒక్క ఎండాకాలంలోనే వారికి చేతినిండా పని దొరకడంతోపాటు ఆర్థికంగా బాగుంటుంది. తెనాలి, చేబ్రోలు మండలాల్లోని కొలకలూరు, శలపాడు గ్రామాల్లో దాదాపుగా 700 కుటుంబాలు కులవృత్తిపై ఆధారపడి జీవనంసాగిస్తున్నారు. కుటుంబమంతా కలిసి ఉదయం నుంచి రాత్రి వరకూ శ్రమిస్తే వివిధ రకాల మట్టి ఆకృతులను తయారు చేస్తారు. మట్టి ఉత్పత్తులకు డిమాండ్ ఉన్నా వాటిని తయారు చేసేందుకు అవసరమైన మట్టి కొరత తీవ్రంగా ఉండటంతో శాలివాహనులు ఆందోళన చెందుతున్నారు. గతంలో విరివిగా దొరికే ఈ మట్టి ప్రస్తుతం చేబ్రోలు మండలం సుద్ధపల్లి క్వారీలో మాత్రమే లభిస్తోంది. చేతి వృత్తిదారుల జీవో ప్రకారం క్వారీ యజమానులకు కొంత మొత్తంలో చెల్లించి కూలీలతో మట్టిని ట్రాక్టర్‌లో నింపుకుని తరలించుకుంటారు. ఇందుకు ఒక్క ట్రక్కు మట్టికి శలపాడుకు రూ. 4200, కొలకలూరుకు రూ.5500 వరకూ వెచ్చించాల్సి వస్తోంది.



గోడౌన్‌లు లేక ఇంటి పరిసరాల్లో నిల్వచేసిన కుండలు

ఈ ప్రాంతాల్లో తయారుచేసే మట్టి ఆకృతులు రాష్ట్ర, ఇతర రాష్ట్రాలకు సైతం ఎగుమతులు జరుగుతుంటాయి. మట్టి కొరత వేదిస్తుండటం, ముడి సరుకుల ధరలు పెరగడం, వారు తయారుచేసిన ఉత్పత్తులను సొంతంగా అమ్ముకునేందుకు సరైన మార్కెట్లు లేకపోవడం వంటి పలు సమస్యలతో మిగిలేది తక్కువేనని కార్మికులు వాపోతున్నారు. 20లీటర్లు తాగునీరు పట్టే ఒక్కోకుండ తయారీకి రూ.100 వరకూ ఖర్చు అవుతుందని సొంతగా మార్కెట్లు లేకపోవడంతో దళారులకు అమ్ముకునే పరిస్థితి ఉందని కార్మికులు చెబుతున్నారు. తమ వద్ద రూ.120కి కొనుగోలు చేసి వ్యాపారులు రూ.200 నుంచి 250వరకూ అమ్ముకుంటున్నారని కష్టపడేవారికి మాత్రం మిగిలేది తక్కువేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుండల తయారీకి ఉదయాన్నే 5 గంటలకు కుటుంబమంతా నిద్రలేచి మట్టిని మొత్తగా కొట్టి దానిని నీటిలో నానబెట్టి వచ్చిన మట్టి ముద్దలతో కుండలు తయారు చేయాల్సి ఉంటుంది. పచ్చిగా ఉన్న కుండలను ఎండబెట్టి అనంతరం బట్టీతో కాల్చాల్సి ఉందని తరువాత పాలీష్‌వేస్తే కాని వినియోగానికి సిద్ధం కావు. ఇందుకు ఇంటిల్లిపాది కష్టపడితే ఐదు రోజులు పడుతుంది. కుండలను మార్కెట్టుకు తరలించేంత వరకూ తమ ఇండ్లలోనే జాగ్రత్తగా భద్రపరచాల్సి ఉందని తమకు గొడౌన్ వంటివి లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. కుల వృత్తిని ప్రోత్సహించేలా ప్రభుత్వాలు ప్రణాళికతో ముందుకు సాగటం లేదని ఆరోపిస్తున్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉండగా విద్యుత్ సారెలు, మట్టి పొడిగా చేసే మిషన్లు, ఇతర ప్రోత్సాహకాలను అందించి ఆదుకుందని గుర్తుచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అయినా తమ కష్టాలు తీరేలా శాలివాహనులకు అవసరమైన విద్యుత్ సారెలు, కుండలు భద్రపరిచేందుకు షెడ్డులు, బట్టీ వేసేందుకు అవసరమైన స్థలాన్ని కేటాయించడంతో పాటు తయారీకి మట్టిని అందేలా చూడాలని చేతి ఉత్పత్తులను స్వయంగా మార్కెటింగ్ చేసుకునేలా ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటుచేసి అందిస్తే శాలివాహనుల జీవితాల్లో వెలుగులు నింపిన వారవుతారని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

పురపాలక సంఘ పనితీరుపై ప్రజల్లో అసహనం

కౌన్సిల్ సమావేశంలో అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్ల ధ్వజం



కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కౌన్సిలర్లు, అధికారులు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పనితీరుపై వార్డు ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారంటూ కౌన్సిల్ సమావేశంలో వైసీపీ, టీడీపీ కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. శుక్రవారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన మునిసిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. అజెండాలోని ఐదు అంశాలను కౌన్సిల్ ఆమోదించిన అనంతరం సభలో పలు సమస్యలపై కౌన్సిలర్లు చర్చకు పట్టుబట్టారు. వినపాడు పార్కులో ఎన్నికల కోడ్ రాకముందే పనులు ప్రారంభించినప్పటికీ వాటిని కొనసాగించకుండా నిలుపుదల చేయడంపై అత్యవసరంగా జరగాల్సిన పనులని చెప్పినా నిర్లక్షంగా వ్యవహరిస్తున్నారంటూ వైసీపీ కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య అసహనం వ్యక్తం చేశారు. వార్డు ప్రజలకు ఉపయోగపడే వాటిపై దృష్టి పెట్టకపోవడం సరైన విధానం కాదని మండిపడ్డారు. పురపాలక సంఘంలో ఇంజనీరింగ్ విభాగంలో జాప్యం వల్ల అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని, సకాలంలో బిల్లులు రూపొందించడంలేదని పలువురి నుంచి ఆరోపణలున్నట్లు చెప్పారు. కమిషనర్ బండి శేషన్న వివరణ ఇస్తూ కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ అధికారులతో పలుమార్లు సమీక్ష జరిపామని అందులో 67ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసిందన్నారు. ఈ నెలాఖరులోపు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కబేళా వంతెన వద్ద ఉన్న పడమర కాల్వకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు 15నెలల క్రితం రూ3లక్షలు మంజూరు చేయడం జరిగిందని నేటికి పనులు ప్రారంభానికి నోచుకోకపోవడంతో అనేకమంది ప్రమాదాల బారినపడుతున్నారని ప్రజలకు ఉపయోగపడే అంశంపై ఎందుకు జాప్యం జరుగుతుందని 22వ వార్డు వైసీపీ కౌన్సిలర్ షేక్ దుబాయ్ బాబు ప్రశ్నించగా త్వరలోనే పనులు ప్రారంభిస్తామని బదులిచ్చారు. వైసీపీ కౌన్సిలర్ సుజాత మాట్లాడుతూ చినరావూరు తోట గేటు వద్ద వర్షాకాలంలో నీరు నిలిచిపోతుందని అక్కడ రోడ్డు ఏర్పాటు చేయాలని గతంలో కోరామని, సగభాగం మాత్రమే రోడ్డు వేసి మిగిలిన దానిని ఇంజనీరింగ్ అధికారులు వదిలేశారని దీంతో అది నిరుపయోగంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత కమిషనర్ రూ. 10లక్షలే రోడ్డుకు కేటాయించడం వలన సగం రోడ్డు వేయడం జరిగిందని ఇన్‌చార్జ్ ఎంఈవో ఆకుల శ్రీనివాసరావు తెలిపారు. మిగిలిన రోడ్డు వేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 4, 26వ వార్డులలో కల్వర్టుల నిర్మాణాలకు టెండర్లు పిలిచి నేటికి పనులు ప్రారంభించలేదని టీడీపీ కౌన్సిలర్ అడుసుమల్లి వెంకటేశ్వరరావు, షేక్ ఇస్మాయిల్ బేగ్ తెలిపారు. పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణంలోని ప్రజలందరికీ తాగునీరు అందించేలా ఏర్పాటుచేసిన రక్షిత తాగునీటి పథకం చాలా అస్తవ్యస్తంగా ఉందని, కుళాయి కనెక్షన్లు ఉన్నా కొందరికి నీరు రాని పరిస్థితి నేటికి ఉందని 17వ వార్డు టీడీపీ కౌన్సిలర్ అన్నం పిన్నారావు తెలిపారు. కౌన్సిలర్లు తెలిపిన ప్రతి అంశాన్ని నోట్ చేసుకోవడం జరిగిందని త్వరితగతిన వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కమిషనర్ శేషన్న వివరణ ఇచ్చారు. అనంతరం సమావేశాన్ని ముగిస్తున్నట్లు ఛైర్‌పర్సన్ రాధిక తెలిపారు. సమావేశంలో వైస్ ఛైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి పలువురు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



కొల్లిపర మండలం మున్నంగిలో సైన్సు ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్న విద్యార్థులు



పొన్నూరులో సీవీ రామన్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన సైన్స్ డే వేడుకలలో సైన్స్ ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనను ఎంఈవో శ్రీనివాసరెడ్డి, ప్రారంభించి విద్యార్థులు ప్రదర్శించిన ప్రతి ప్రాజెక్టును ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో గుంటూరు ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య, రీజనల్ ఇన్‌చార్జి అప్పాజీ, ప్రిన్సిపల్ భాషా, కోఆర్డినేటర్ గోపి, డీన్ శేఖర్, ఇన్‌చార్జిలు అనూష, శాంతకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● పొన్నూరు టౌన్: శాస్త్రవేత్తల జీవిత చరిత్రలను విద్యార్థులు తప్పనిసరిగా అధ్యయనం చేయాలని ఎస్ఎస్‌టీ స్కూల్ డైరెక్టర్ కొలిపర్తి శివనాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ఎస్ఎస్‌టీ స్కూల్‌లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి వెలనాటి రామదాసు, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్: రామన్ ఎఫెక్ట్ ప్రపంచాన్ని అబ్బురపరిచిందని వీఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రవీంద్రనాథ్ పేర్కొన్నారు. కళాశాలలో శుక్రవారం సైన్స్ దినోత్సవం నిర్వహించారు. దేశం అభివృద్ధి శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. నోబెల్ ప్రైజ్ అందుకున్న రెండో భారతీయుడిగా రామన్ నిలిచారని చెప్పారు. భౌతిక శాస్త్రంలో ఆయన పరిశోధనలు నేటికి మార్గదర్శకంగా ఉన్నాయని, విద్యార్థులు ప్రణాళికతో పనిచేసి ఉపాధి అవకాశాలు అందుకోవాలన్నారు. విద్యార్థులు పీపీటీలతో భౌతికశాస్త్ర అంశాలను ప్రదర్శించారు. అధ్యాపకులు తిరుపతమ్మ, దేవి ప్రియ పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్: విద్యార్థులలో దాగి వున్న సృజనాత్మకత వెలికి తీసేందుకు విజ్ఞాన ప్రదర్శనలు దోహదపడతాయని స్నేహానికేతన్ ఎండీ మురళీకాంత్ పేర్కొన్నారు. బోసురోడ్డులోని స్కూల్‌లో శుక్రవారం సైన్స్ డే నిర్వహించారు. శాస్త్రవేత్త సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన పలు నమూనాలను ప్రదర్శించారు.

● కొల్లిపర: విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మండలంలోని మున్నంగి, కొల్లిపర ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థులు సైన్సు ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ సైన్సు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం వలన విద్యార్థులలో మేధాశక్తిని వెలుగుతీయవచ్చునన్నారు. తొలుత ఉపాధ్యాయులు భారతీయ భౌతిక శాస్త్రవేత్త సీవీ రామన్‌కు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు వెంకట్రావు, సోమరౌతు లక్ష్మీకమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● తెనాలి రూరల్: పట్టణంలోని జేఎంజే కళాశాలలో నేషనల్ సైన్స్‌డే జరిగింది. వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కళాశాల అధ్యాపకులు పి.సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా పాల్గొని సర్‌సీవీరామన్ చేసిన ప్రయోగాలను నోబుల్ బహుమతి పొందిన విధానాన్ని విద్యార్థినులకు వివరించారు. సైన్స్‌పై ప్రతి విద్యార్థి ఆసక్తి కనబరుస్తూ మంచి విజ్ఞానవంతులుగా ఎదగాలని కోరారు. రసాయన, భౌతిక శాస్త్ర విభాగపు హెచ్‌వోడీలు డాక్టర్ కె.నిర్మలజ్యోతి, సి.అనిత పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో పలువురు విద్యార్థినులు పాల్గొన్నారు.

పాత శివాలయంలో ముగిసిన శివరాత్రి ఉత్సవాలు



ద్వాదశ ప్రదక్షిణ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గంగానమ్మపేటలోని పాత శివాలయంలో నిర్వహిస్తున్న మహా శివరాత్రి ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ నెల 23 నుంచి శ్రీపర్వత వర్ధిని సమేత రామేశ్వర స్వామి ఆలయంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. నిత్య పూజ, హోమ విధులు, బలిహరణ, వసంతోత్సవం, వసంత మంటపసేవ, పూర్ణాహుతి, వేదాశీస్సులు, ధ్వజావరోహణం, ద్వాదశ ప్రదక్షిణలు, పుష్పయాగం నిర్వహించారు. ఈవో రమణకుమారి, అర్చకులు పొత్తూరి వెంకటసురేష్, ధర్మకర్తలు భాస్కరరావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

మహా శివరాత్రి పురస్కరించుకుని గంగానమ్మపేట పాత శివాలయంలో భక్తులకు అన్నదానం చేశారు. ఎన్నికలలో జనసేన నేత నాదెండ్ల మనోహర్ విజయం సాధించి మంత్రి పదవి చేపట్టాలని రాంప్రసాద్, మిత్ర బృందం ఎన్నికల సమయంలో గత శివరాత్రి ఉత్సవాలలో స్వామి వారికి పూజలు చేశారు. ఎన్నికల్లో భారీ విజయం సాధించడంతో పాటు మంత్రి పదవి కూడా చేపట్టడంతో శుక్రవారం మూడు వేల మందికి అన్నదానం చేశారు.

ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగించుకోవాలి

● ఏపీవో రవి



అత్తోటలో ఉపాధిహామీ పనుల్లో పాల్గొన్న కూలీలు

కొల్లిపర, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో మందా రవి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి, చెముడుబాడు, దావులూరు, అత్తోట, కొల్లిపర తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. కూలీలకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా పేదప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉందన్నారు. ఉపాధిహామీ పనులకు వచ్చే కూలీలు సమయపాలన తప్పనిసరిగా పాటించాలన్నారు. ఉపాధిహామీ పనుల్లో పాల్గొనే కూలీలకు కొలతలు బట్టి వేతనం చెల్లించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ అజయ్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు వల్లభాపురం బుజ్జిబాబు, కనపర్తి సాగర్, వి.రాజేంద్ర, కోటేశ్వరరావు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న దర్జీలు

ఘనంగా టైలర్స్ డే

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): టైలర్ల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు ఇవ్వాలని పొన్నూరు టైలర్స్ వర్కర్స్ యూనియన్ మాజీ అధ్యక్షురాలు బండారు ఉమామహేశ్వరి అన్నారు. శుక్రవారం పట్టణంలో టైలర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక తోటమ్మతల్లి ఆలయం వద్ద నుంచి యూనియన్ నాయకులు ప్రదర్శన నిర్వహించారు. కుట్టు యంత్రాన్ని కనిపెట్టిన ఎలియాజ్ హరావేకు నివాళులు అర్పించారు. యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. హరావే టైలరింగ్ రూపకల్పనతో మానవజాతి జీవనోపాధితో పాటు అందమైన వస్త్రాలను రూపొందించుకుని ధరిస్తున్నారని కొనియాడారు. టైలర్‌లకు వయస్సుతో నిమిత్తం లేకుండా పెన్షన్‌లు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. టైలర్‌ల సంక్షేమానికి కృషి చేస్తున్న ఉమామహేశ్వరిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పట్టణంలోని టైలర్ల యూనియన్ నాయకులు మాకాని సుధాకర్, షేక్ సుభాని, కరీముల్లా, రియాజ్, వెంకట్రావు, వహీద్, మల్లికార్జునరావు, స్వామి, రవి, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు, తదితరులు పాల్గొన్నారు.